PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 306 | విజయవాడ, సోమవారం 10 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 10 June 2024 | Rs

JEE ADVANCED 2024

4,187+

శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో JEE ADVANCED 2024

టాప్ 500 లోపు **122** ర్యాంకులు

టాప్ 1000 లోపు **203** ర్యాంకులు

JEE ADVANCED 2024 ఫలితాలు

Infinity Learn | 39 Years of Excellence



ALL INDIA **1** RANK

RAGHAV SHARMA
H.T. NO: 242053073* EWS

శ్రీచైతన్య విద్యార్థులమైన మేము...

పటిష్టమైన ప్రోగ్రాములతో... IITలో సాధించిన ఈ బెస్ట్ ర్యాంకులతో మా తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నతస్థాయిలో ఉంటామని ప్రమాణం చేస్తున్నాం

ఓపెన్ కేటగిరిలో ఆలిండియా టాప్ 10 లోపు 5 ర్యాంకులు

ALL INDIA OPEN CATEGORY RANK 4 — 337/360 MARKS
RHYTHM KEDIA
H.T. No: 247025176*

పరీక్షా విధానంపై పట్టు వచ్చింది

"నేను IIT-JEE లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4వ ర్యాంక్ సాధించడానికి శ్రీచైతన్య పటిష్టమైన ప్రోగ్రాములు, నిర్దిష్టమైన ప్రణాళిక నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. వీకెండ్ టెస్టులు, యూనిట్ టెస్టులు, గ్రాండ్ టెస్టుల ద్వారా చాలా ప్రశ్నల అధ్యయనం చేయడమే కాకుండా అధ్యాపకుల ప్రోత్సాహమే నన్ను విజేతగా నిలిపాయి. శ్రీచైతన్య యాజమాన్యానికి నా కృతజ్ఞతలు."

ALL INDIA OPEN CATEGORY RANK 5 — 334/360 MARKS
PUTTI KUSHAL KUMAR
H.T. No: 246150349

రివిజన్ ప్రోగ్రామ్‌తో నేను ఎంతో నేర్చుకున్నాను

"నేను IIT -JEE లో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 5వ ర్యాంక్ సాధించి, నా తల్లిదండ్రుల కలలను సాకారం చేశాను. IIT లక్ష్యంగా రూపొందించిన ప్రోగ్రామ్స్ వల్లనే నేను నా IIT లక్ష్యాన్ని ఈజీగా సాధించాను. IPL Super 60 ప్రోగ్రామ్ లోని 2 గంటల బోధన, 9 నెలల రివిజన్ ప్రోగ్రామ్ లోని పార్టు టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లీ అసైన్మెంట్స్ ఎంతో ఉపయోగపడ్డాయి. శ్రీచైతన్య యాజమాన్యానికి నా కృతజ్ఞతలు."

P.Kushal kumar

ALL INDIA OPEN CATEGORY RANK 6 — 333/360 MARKS
RAJDEEP MISHRA
H.T. No: 241016176*

ప్రశ్నాపత్రాల స్టాండర్డ్ నన్ను ఎప్పుడూ ఎలర్ట్ చేసింది

"నాకు IIT-JEEలో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 6వ ర్యాంక్ సాధించడానికి శ్రీచైతన్య ప్రోగ్రాములు, స్టడీమెటీరియల్స్, రెగ్యులర్ గ్రాండ్ టెస్టు, Indepth Micro Analysis వల్లనే ఈ విజయం సాధ్యమయింది. గత రెండు సంవత్సరాలుగా రెగ్యులర్ డౌట్ క్లియరింగ్ సెషన్లు, సబ్జెక్ట్ వారీగా, కాన్సెప్ట్ బలోపేతం చేసే సెషన్లు నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. శ్రీచైతన్య బోధనా సిబ్బందికి కృతజ్ఞతలు."

Rajdeep

ALL INDIA OPEN CATEGORY RANK 9 — 329/360 MARKS
DHRUVIN HEMANT DOSHI
H.T. No: 241106162

నాకున్న ఒత్తిడిని తొలగించి, ఆత్మవిశ్వాసం పెంచారు

"IIT -JEE లో ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 9వ ర్యాంక్ సాధించడం చాలా ఆనందంగా ఉంది. శ్రీచైతన్య ఒత్తిడిలేని శిక్షణ, పటిష్టమైన ప్రోగ్రాములు, నిర్దిష్టమైన ప్రణాళిక, స్టడి మెటీరియల్ వల్లనే నేను ఐఐటీ క్రాక్ చేశాను. కేర్, మోటివేషన్, హైజీనిక్ ఫుడ్ తో ఇంటిని మరిపించే హాస్టల్ ఎన్విరాన్మెంట్ కారణంగా మాకు చదువుపై ఫోకస్ పెరిగింది. నాకు ఎంతో సపోర్ట్ గా నిలిచిన శ్రీచైతన్య విద్యాసంస్థ మేలు ఎప్పటికి మరచిపోలేను."

Dhruvin

ALL INDIA OPEN CATEGORY RANK 10 — 329/360 MARKS
A S S D B SIDHVIK SUHAS
H.T. No: 246119101

ఎగ్జామ్ ఎనాలసిస్ నా తప్పులను తెలిసేలా చేసింది

"నేను IIT-JEE 2024 ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10వ ర్యాంక్ సాధించగలిగానంటే ఇందుకు ప్రధాన కారణమైన శ్రీచైతన్య IPL, Super 60 ప్రోగ్రామ్స్, స్టడీ మెటీరియల్, పరీక్షా విధానము, ఎర్రర్ అనాలసిస్ తో పాటు అధ్యాపకులు వ్యక్తిగత శ్రద్ధతో సందేహాలు నివృత్తి చేయడం, మేనేజ్మెంట్ స్నేహ పూర్వక ప్రోత్సాహంతో నా ఆశయానికి వెన్నుదన్నుగా నిలిచిన శ్రీచైతన్యకి కృతజ్ఞతలు."

A. Suhas

ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100లోపు 30 ర్యాంకులు

Rank	Name	H.T. No
12	RAGHAV SHARMA	242053073*
14	VEDANT SAINI	247004173
16	BISMIT SAHOO	242072080*
28	SHEKHAR JHA	242031290*
31	ISHAAN GUPTA	242014288*
34	N SIDDHARTH REDDY (Sri Chaitanya Techno School Student)	246053446
38	AKSHAR ZALA	241019087*
43	KESHAV SINGHAL	242027289*
55	SATIVADA JYOTHIRADITYA	246022079
57	AADITYA KUMAR	242067130*
68	MAYANK JAIN	247004363
71	P V S D SAI MOHITH (Sri Chaitanya Techno School Student)	246008172
74	HIMANSHU THALOR	242050438*
77	MOHAMMAD EMAAD ARIF	242054030*
83	AMAAN KHAN	242026030*
85	BIBASWAN BISWAS	245058146*
88	FENIL MAYANK PATEL	241006043*
91	AMAR SINHA	242057008*
93	HARDIK AGGARWAL	247007101*
94	G N NIRMALKUMAR	241110162*
95	UJJWAL SINGH	242050207*
96	ANIKET KUMAR	243035068
97	M E VENKATA PARTHIV (Sri Chaitanya Techno School Student)	246162250
99	TANAY CHETAN KAKLIYA	242057318*
100	T V S SAI NAGA BHUSHAN	246016038

ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 100 లోపు **30** ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 500 లోపు **122** ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 1000 లోపు **203** ర్యాంకులు

ఆలిండియా ఆల్ క్యాటగిరి 100 లోపు **146** ర్యాంకులు

ఆలిండియా ఆల్ క్యాటగిరి 1000 లోపు **721** ర్యాంకులు



4,187+

JEE ADVANCED - 2024లో శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు

JEE MAIN | JEE ADVANCED

LONGTERM 2025

అడ్మిషన్లు జరుగుచున్నవి

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Sri Chaitanya Educational Committee INDIA

Ph: 040 66 06 06 06 | www.srichaitanya.net

SCAN QR CODE FOR WEBSITE

*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback | *DLP / AITS

'ఉక్కు'పై ప్రధాని ప్రకటన చేయాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి – ఉక్కునగరం (విశాఖపట్నం)

ఈ నెల 12న చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా వస్తున్న ప్రధాని మోడీ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకుంటున్నట్టు ప్రకటన చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1214వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నేతలు డి.ఆదినారాయణ, జి.గణపతి రెడ్డి, దొమ్మేటి అప్పారావు, కెఎస్‌ఎం.రావు, విల్లా రామ్మోహన్ కుమార్, కామేశ్వరరావు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయమై కూటమి ప్రభుత్వం మోడీ సర్కారుపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. గత పదేళ్లలో రూ.లక్షల కోట్లను కార్పొరేట్లకు రుణమాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం సకాలంలో వడ్డీలు, అసలు బ్యాంకులకు చెల్లిస్తున్న విశాఖ ఉక్కు కర్మాగారానికి ఆర్థిక సహకారం అందించకపోవడం దారుణమన్నారు. గత పదేళ్ల బిజెపి పాలనలో రాష్ట్రం పట్ల కేంద్రం వివక్షత చూపిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వ మద్దతు కేంద్రానికి కీలకమైనందున స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో చురుగ్గా ముందుకు కదలాలన్నారు. దీక్షల్లో దాసరి శ్రీనివాస్, శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, ఉరుకూటి అప్పారావు, సత్యారావు, వి.అప్పలరాజు, డి.ఈశ్వరరావు, వెంకట్రావు, కనకరాజు పాల్గొన్నారు.

సిఎం ప్రమాణ స్వీకారోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు

- కేసరిపల్లి సభాస్థలిని పరిశీలించిన సిఎస్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, పలు రాష్ట్రాల సిఎంలు, కేంద్ర మంత్రులు, శాసన సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు రానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆదివారం డిజిపి హరీష్‌కుమార్‌గుప్తా, కార్యక్రమ ప్రత్యేక అధికారులు ప్రద్యుమ్న, బాబు ఎ, వీరపాండియన్, వ్యవసాయశాఖ కమిషనరు హరికిరణ్, అదనపు డిజిపి బాగ్చి, ఐజిలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, పోలీస్ కమిషనరు రామకృష్ణ, కృష్ణా జిల్లా కలెక్టరు డికె బాలాజీ, జిల్లా పోలీస్ అధికారి అద్నాన్ నయీూమ్ ఆస్మాలతో కలిసి గన్నవరం మండలం కేసరిపల్లిలోని ఐటి పార్కు మేథా టవర్స్ సమీపంలోని ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. తొలుత మేథా టవర్స్ సమీపంలో జరుగుతున్న సభాస్థలి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం వీక్షించేందుకు వీలుగా సభా ప్రాంగణంతోపాటు వెలుపల ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. గన్నవరం జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంక్, ఎన్‌టిఆర్ ప్రభుత్వ పశు వైద్యకళాశాల, కేసరపల్లి ముస్తాబాద్ రోడ్డు సమీపంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు, ఎలిట్ విస్టాస్, మేథా టవర్స్, ఇతర లే అవుట్లలో ఎంపిక చేసిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.



ప్రధాని, సిఎంలు సభా ప్రాంగణానికి రావడానికి వీలుగా బారికేడ్లు

ప్రధానితోపాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధాన సభ వేదిక వద్దకు చేరుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా బారికేడ్ ఏర్పాటు చేయాలని, అప్రోచ్ రహదారికి మరమ్మతులు చేయాలని సిఎస్ ఆదేశించారు.

ఎలీట్ విస్టాస్‌లో వివిఐపి పార్కింగ్

ఎలీట్ విస్టాస్‌లో ఎమ్మెల్యేలు, ఎంపిలు, న్యాయమూర్తులు, ప్రముఖులకు పార్కింగ్ స్థలాన్ని ఎంపిక చేశారు. అక్కడ నుంచి వారు సభాస్థలికి చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేకమైన వస్త్రాలతో సుందరీకరించాలని అధికారులకు సిఎస్ సూచించారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను నిర్మించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పర్యటనలో కృష్ణా, గుంటూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు గీతాంజలిశర్మ, జి రాజకుమారి, విజయవాడ, రాజమండ్రి మున్సిపల్ కమిషనర్లు స్వప్నిల్ దినకర్, దినేష్‌కుమార్, డిఐజి గోపీనాథ్ జెట్టి, విజయవాడ డిసిపి అధిరాజ్ ఎస్, రానా, గుడివాడ ఆర్‌డిఒ పి పద్మావతి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కర్నూలులో దారుణం

- టిడిపి కార్యకర్త హత్య

ప్రజాశక్తి–వెల్దుర్తి (కర్నూలు)



చంద్రబాబునాయుడుతో గిరి (ఫైల్)

కర్నూలు జిల్లాలో దారుణం జరిగింది. టిడిపి కార్యకర్తను వైసిపి నేతలు వేటకొడవళ్లతో నరికి హత్య చేశారు. ఈ సంఘటన వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పోలింగు రోజున వైసిపి, టిడిపి నాయకుల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటుచేసుకుంది. వైసిపి కార్యకర్తలను టిడిపి నాయకులు కొట్టారు. ఈలోపు పోలీసులు వచ్చి చెదరగొట్టడంతో వివాదం సర్దుమణిగింది. ఆదివారం సాయంత్రం టిడిపి కార్యకర్త గిరి (35) తన సోదరునితో కలిసి వైసిపి నాయకుడు రమేష్ ఇంటివైపు వెళ్లారు. ఇటువైపు ఎందుకు వచ్చావంటూ గిరిని రమేష్ నిలదీయడంతో మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో రమేష్ తన అనుచరులతో కలిసి గిరి, ఆయన సోదరునిపై వేటకొడవళ్లతో దాడి చేశారు. గిరికి బలమైన గాయాలయ్యాయి. ఆయన సోదరుడు స్వల్ప గాయాలతో తప్పించుకున్నారు. తీవ్రంగా గాయపడిన గిరిని కుటుంబ సభ్యులు వెల్దుర్తి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ పి.చంద్రశేఖర్ రెడ్డి బొమ్మిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు పాల్పడిన వారి వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్తతలు తావివ్వకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

అమరావతి రూపురేఖల కోసం
తక్షణం రూ.2 వేల కోట్లు

- సిఆర్‌డిఎ అధికారుల అంచనా
- నిధుల సమీకరణపై దృష్టి

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అమరావతి రాజధాని నిర్మాణం రూపురేఖలకు ప్రభుత్వం తొలి ప్రాధాన్యతగా ఇస్తున్న నేపథ్యంలో సిఆర్‌డిఎ అధికారులు నిధుల సేకరణపై దృష్టి సారించారు. ఇప్పుడున్న ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్, భవనాల ప్రారంభం, రోడ్ల నిర్మాణానికి తక్షణం రూ.2 వేల కోట్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. వీటిని సమీకరించుకోవడమా, ప్రభుత్వం నుండి తక్షణావసరంగా తీసుకోవడమా అనేది ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం డెవలప్‌మెంట్ నిధుల నుండి తక్షణ పనులు చేపట్టామని, ప్రభుత్వం ఏర్పాటైన తరువాత దీనిపై క్లారిటీ తీసుకుంటామని అధికారులు వివరించారు. రాజధాని ప్రాంతంలో వేసిన రోడ్లను గత నాలుగేళ్లలో తవ్వేశారు. కంకరను సొంత అవసరాలు, ఇతర ప్రాజెక్టులకు తరలించారు. దీనిలో కొంతమంది వైసిపి ప్రజా ప్రతినిధుల పాత్ర ఉందని రైతులు ఫిర్యాదు కూడా చేశారు.

దీంతోపాటు ఇనుము, ఇసుక, ఇతర వైరింగ్ మెటీరియల్, పైపులు మొత్తం తరలించుకుపోయారు. వీటిల్లో ఇనుమును తరలించే నిందితులను పట్టుకుని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం రాజధాని రూపు రేఖలు రావాలంటే గతంలో వేసిన రోడ్లలో ఎనిమిది రోడ్లను మరలా నిర్మించాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. కొన్నిచోట్ల రోడ్లను నాలుగు అడుగుల మేర తవ్వేశారు. మెటీరియల్‌ను వేరేచోట రోడ్లు వేయడానికి వినియోగించారు. ఒకవైపు నిర్మాణం జరుపుతూనే మరోవైపు విచారణ జరపాలని సిఆర్‌డిఎ అధికారులు నిర్ణయించారు. వీటితోపాటు జంగిల్ క్లియరెన్స్‌కే దాదాపు రూ.10 కోట్లకుపైగా ఖర్చవుతుందని లెక్కలేస్తున్నారు. తాత్కాలిక పనులు, కనీస సదుపాయాలకు ఎకరాకు రూ.లక్ష చొప్పున వేసుకున్నా రూ.350 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. భవనాల పనులు, నిర్మించిన వాటిల్లో సదుపాయాలు, వీధిలైట్లు, మంచినీటి పైపులైన్లకు ఎంతకాదన్నా ప్రాథమికంగా రూ.400 కోట్ల వరకూ ఖర్చవుతుందని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తక్షణ అవసరాల కోసం రూ.2 వేల కోట్లన్నా కావాల్సి ఉంటుందని తేల్చినట్లు తెలిసింది.

రోడ్లు కనిపించడం లేదు

నాలుగు రోజులుగా అమరావతిలో తిరుగుతున్న అధికారులకు కొత్త సమస్య వచ్చిపడింది. గతంలో నిర్మించిన అమరావతి రోడ్లు మాయం అయ్యాయని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. జ్యుడీషియల్ భవనాల నుండి విట్‌కు వెళ్లే దారిలో రోడ్లు పూర్తిగా మాయమయ్యాయని, ఉద్దండ్రాయునిపాలెం, లింగాయపాలెం పరిసరాల్లో మూడు రోడ్లు అసలు కనిపించడం లేదని గుర్తించారు. ఐనవోలు, వెలగపూడి, తుళ్లూరు గ్రామాల సమీపంలో గతంలో వేసిన పైపులైన్లు కనిపించడం లేదు. అసలు రోడ్లు కనిపించకపోవడం ఏమిటనే అంశంపై ఇప్పుడు సిఆర్‌డిఎ అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఇప్పటి వరకూ బాధ్యతల్లో ఉన్న అధికారులు ఏం చేస్తున్నారని ఉన్నతాధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. మొత్తంగా ఈ వ్యవహారం సిఆర్‌డిఎలో కొంతమంది అధికారులకు చుట్టుకోనుందని, వారిపై తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం.



రామోజీరావు అంతిమయాత్రకు హాజరైన అభిమానులు



రామోజీరావు అంత్యక్రియలకు హాజరైన చంద్రబాబు, లోకేష్ తదితరులు

రామోజీకి ప్రముఖుల కన్నీటి వీడ్కోలు

ప్రజాశక్తి– హైదరాబాద్ బ్యూరో

అక్షరయోధుడు రామోజీరావుకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు తరలివచ్చారు. 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య ఫిల్మ్ సిటీలోని స్మారక కట్టడంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ఎంపిలు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చింతమనేని ప్రభాకర్, రఘురామకృష్ణరాజు, అరిమిల్లి రాధాకృష్ణ, వెనిగండ్ల రాము, టిడిపి అధికార ప్రతినిధి పట్టాభిరామ్, మురళీమోహన్, ప్రముఖ వైద్యులు గురవారెడ్డి, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి, సీనియర్ నాయకులు పోచారం శ్రీనివాసరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మోత్కుపల్లి నర్సింహులు, నామా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రామోజీరావు అంత్యక్రియలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరుపున అధికార ప్రతినిధులుగా సీనియర్ అధికారులు ఆర్‌పి సిసోడియా, సాయిప్రసాద్, రజత్ భార్గవ్ హాజరయ్యారు.

త్వరలో ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

భవనాలు, హైకోర్టు, జ్యుడీషియల్ కాంప్లెక్స్, హైకోర్టు, గ్రూప్ డి ఉద్యోగుల భవనాల దగ్గర వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం అనంతరం సమీక్షించి దానికి నిధులు విడుదల చేస్తామని పేర్కొన్నారు. మొత్తంగా 25 ప్రాంతాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. ప్రతి పని గురించీ వేర్వేరుగా సమీక్ష చేస్తున్నామని చెప్పారు. జ్యుడీషియల్ ఉద్యోగుల భవనాల వద్ద దారి కూడా సరిగ్గా లేదని గుర్తించామని, దీంతోపాటు విద్యా సంస్థలైన అమృత, విట్, ఎస్ఆర్ఎంలకు వెళ్లేదారిని వెంటనే క్లియర్ చేయాలని నిర్ణయించారు. హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు కేటాయించిన భవనాల్లో పిచ్చిమొక్కలు తొలగించడంతోపాటు, అక్కడ నివాసానికి వీలుగా అవసరమైన సదుపాయాలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఉన్నతాధికారుల భవనాలను సిద్ధం చేసి అధికారులందరూ అక్కడకు వచ్చేలా చూడాలని నిర్ణయించారని, దానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. పనుల ప్రాధాన్యత ఆధారంగా వాటిని వరుస క్రమంలో వీలైనంత తొందరగా చేపడతామని అన్నారు. ఆయన వెంట సిఆర్‌డిఎ కమిషనరు వివేక్‌యాదవ్, సిఇ ధనుంజయ తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం–అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా – 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నీట్ పరీక్షా ఫలితాలపై విచారణ చేపట్టాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నీట్ పరీక్షా ఫలితాల్లో జరిగిన అవకతవక పై సమగ్ర విచారణ చేపట్టాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టిఎ వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయని ఎన్‌టిఎపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగువిధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాల్లో ఒకే పరీక్షా కేంద్రం, ఒకే సీరియల్ నంబర్లతో ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావటం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితంతో ముడిపడి ఉన్న ఈ సమస్య పట్ల ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు.

10 నుంచి 13 వరకు ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

బిపిఇడి, డిపిఇడి కోర్సుల్లో ప్రవేశానికిగాను ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు శాతవాహన యూనివర్సిటీ వద్ద ఫిజికల్ ఫిట్నెస్, స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు టిజిపిఇసెట్ –2024 కన్వీనర్ ప్రొఫెసర్ రాజేశ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు ఈ టెస్ట్ ఉంటుందని వెల్లడించారు.



గుంటూరులో జిమ్ సెంటర్‌కు ఎన్‌టిఆర్ పేరుతో బోర్డు ఏర్పాటు చేస్తున్న టిడిపి కార్యకర్తలు



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ధ్వంసం చేసిన విగ్రహాలు

నవరత్నాల నిలయంపై దాడి

- విగ్రహాలు, శిలాఫలకాలు ధ్వంసం

ప్రజాశక్తి–యంత్రాంగం

రాష్ట్రంలో పలుచోట్ల వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహాలు, శిలాఫలకాలను శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగుటు ధ్వంసం చేశారు. తిరుపతిలో నవరత్నాల నిలయంపై దాడి చేశారు. నవరత్నాల నిలయం ముందు నిర్మించిన రైతు, గ్రామీణ మహిళ విగ్రహాలను కూలదోశారు. గుంటూరులో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే టిడిపి కార్యకర్తలు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని వైసిపి నేతలు మండిపడ్డారు.

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో సుమారు 2 వేల మంది పేదలకు జగనన్న కాలనీ పేరిట ఇళ్ల స్థలాలు ఇచ్చారు. కాలనీకి ముందు అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి జగన్‌కు కృతజ్ఞతగా నవరత్నాలు నిలయాన్ని నిర్మించారు. దీనిలో నవరత్నాల పథకాలు ప్రతిబింబించేలా కట్టడాలు, వైఎస్ఆర్ చిత్రపటాలు, రైతుల విగ్రహాలు ఏర్పాటు చేశారు.

ఈ ఏడాది జూన్ 4న టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత గుర్తు తెలియని వ్యక్తులు నవరత్నాల గుడిపై దాడి చేశారు. శ్రీకాళహస్తి–పిచ్చాటూరు రోడ్డు మార్గంలో రాజీవ్‌నగర్ పరీవాహక ప్రాంతంలో కొందరు వైసిపి నాయకులు ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న అక్రమ కట్టడాలను సైతం కూలదోసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో గస్తీకి వచ్చిన పోలీసులను చూసి దుండగులు పారిపోయినట్లు సమాచారం. ఈ విషయంపై టూటౌన్ పోలీసులను వివరణ కోరగా తమకు మున్సిపల్ అధికారుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలపడం గమనార్హం.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో మాజీ సిఎం జగన్ గతేడాది మేలో రాజధాని గ్రామాల్లో పేదలకు 54 వేల ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, నమూనా ఇంటిని, స్తూపాన్ని ధ్వంసం చేశారు. గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో జిమ్ సెంటర్ శిలాఫలకాన్ని టిడిపి నాయకులు పగలగొట్టారు. వైఎస్ఆర్ పేరుతో ఉన్న పేరును తొలగించి ఎన్‌టిఆర్ జిమ్ సెంటర్‌గా బోర్డు మార్చారు.

సంధి కాలంలో ఖరీఫ్ రైతు

(మొదటి పేజీ తరువాయి)

ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంట దెబ్బతిన్నది. కర్ణాటక, మహారాష్ట్రలోనూ కరువు ఉంది. ఆ కారణంగా బహిరంగ మార్కెట్‌లో సైతం వేరుశనగ విత్తనానికి కొరత ఉంది. దాంతో సబ్సిడీ విత్తనాల వైపు రైతులు పరుగులు తీస్తున్నారు. సరిగ్గా ఇప్పుడే ఆర్‌బికెలలో విత్తనం లేదు.

నాణ్యత తీసికట్టు

కంపెనీలకు కాంట్రాక్టులిచ్చి అరకొరగా సేకరించిన విత్తనం సైతం నాసిరకంగా ఉందని ఆరోపణలొస్తున్నాయి. ఎన్నికల సమయం కావడంతో జిల్లాల డిఎఒలు నేరుగా ప్రాసెసింగ్ కేంద్రాలతో మాట్లాడుకొని ఒక్కో లారీ లోడుకు ఇంత అని కమీషన్లు జేబులో వేసుకున్నారని, ప్రాసెసింగ్ సరిగ్గా చేయని విత్తనం ఆర్‌బికెలకు సరఫరా అయిందని విమర్శలొస్తున్నాయి. రైతులకు పంపిణీ చేసిన 30 కిలోల విత్తన కాయలను ఒలిస్తే 70 శాతానికి తక్కువ కాకుండా విత్తనాలు రావాలి. అంటే తక్కువలో తక్కువ 21 కిలోలు రైతుకు రావాలి. కానీ చాలాచోట్ల 20 కిలోలు కూడా రావట్లేదు. నిర్ణీత నాణ్యతా ప్రమాణాల కంటే చాలా ఎక్కువ మోతాదులో చెత్త, చెదారం, తాలు ఉండటంతో రైతులు సబ్సిడీ విత్తనాలను ఆర్‌బికెలకు తిరిగి ఇచ్చేస్తున్నారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళితే... లోడు దించుకునేటప్పుడే చూసుకోవాలంటూ ఎదురు సిబ్బందిపై నెపం వేస్తున్నారు. చేసేది లేక రైతులకు సిబ్బంది నచ్చజెప్పి పంపుతున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల్లో ఘన విజయాలతో ఖుషీగా మూడ్‌లో ఉన్న టిడిపి ఎంఎల్ఎలు, విత్తన సమస్యతో తమకు రైతుల్లో చెడ్డపేరు వస్తుందని మదన పడుతున్నారు.

రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు

(మొదటి పేజీ తరువాయి)

ఐస్లాండ్‌లో ఎంబిఎ పూర్తి చేశారు. 26 ఏళ్ల వయసులోనే ఎంపిగా గెలుపొందారు. టిడిపిలో ప్రస్తుతం జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు అత్యంత సన్నిహితుడు. చంద్రబాబు అరెస్టు సమయంలో టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో కలిసి కీలకంగా వ్యవహరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం లోక్‌సభ నుంచి 3.27 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

దేశంలోనే ఖరీదైన ఎంపిగా పెమ్మసాని

గుంటూరు జిల్లా తెనాలి మండలంలో బుర్రిపాలెం గ్రామంలో సాంబశివరావు, సువర్చ దంపతులకు 1976లో పెమ్మసాని చంద్రశేఖర్ జన్మించారు. వ్యాపార రీత్యా వారి కుటుంబం నరసరావుపేటలో స్థిరపడింది. 1993–94 విద్యాసంవత్సరంలో చంద్రశేఖర్ ఎంసెట్‌లో 27వ ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ విద్యను అభ్యసించారు. పిజి అమెరికాలో చదివారు. అక్కడే యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ పరీక్ష పూర్తిచేశారు. అమెరికాలో లైసెన్సింగ్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం యు వరల్డ్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణ సంస్థను స్థాపించారు. 2014లో నరసరావుపేట పార్లమెంటు స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైనా, రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీటు దక్కలేదు. 2024లో గుంటూరు నుంచి 3,44,695 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అఫిడవిట్లో రూ.5 వేలకు పైగా ఆస్తులను ప్రకటించారు. అలాగే బిజెపి నుంచి గెలుపొందిన శ్రీనివాస వర్మ రాష్ట్రంలోని బిజెపి ముఖ్యనాయకుల్లో కీలకంగా ఉన్నారు. నర్సాపురం నుంచి తొలిసారి పోటీ చేసి 2,76,802 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో
నారాయణ ఆల్‌టైమ్ రికార్డ్

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డ్ సాధించారు. దక్షిణ భారతదేశంలో మొదటి ర్యాంకు సాధించారు. అంతేకాకుండా వివిధ కేటగిరిల్లో 6 ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారు. ఓపెన్ కేగిరిలో టాప్ 20లో 7 ర్యాంకులు, టాప్ 100లో 31 ర్యాంకులు సాధించి నారాయణ విద్యార్థులు సత్తాచాటారు.

ఆలిండియా ఓపెన్ కేటగిరిలో సందేష్ భోగాలపల్లి 3వ ర్యాంకు, రాజ్‌దీప్ మిశ్రా 6వ ర్యాంకు, బాలాదిత్య 11వ ర్యాంకు, రాఘవ్ శర్మ 12, సాహు 16, ఆర్యన్ ప్రకాష్ 17, అమోఘ్ అగర్వాల్ 20వ ర్యాంకు సాధించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ పి సింధూర నారాయణ, పి శరణి నారాయణ తెలిపారు. ఒబిసి, పిడబ్ల్యుడి, ఇడబ్ల్యుఎస్ కేటగిరీల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకులు నారాయణ విద్యార్థులే సాధించారన్నారు. అత్యుత్తమ శిక్షణ, రీసెర్చ్ ఓరియెంటేడ్ ప్రొగ్రామ్స్ వల్లనే ఈ ఫలితాలు వచ్చాయనీ, ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వారు అభినందనలు తెలిపారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో
'ఫిట్జీ' విద్యార్థి తేజేశ్వర్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంక్

ప్రజాశక్తి– ఎడ్యుకేషన్ (విజయవాడ)



ఆలిండియా ఓపెన్ కేటగిరీలో జెఇఇ అడ్వాన్స్‌డ్ 2024 ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థి కోడూరు తేజేశ్వర్‌కు ఆలిండియా 8వ ర్యాంక్, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి మొదటి ర్యాంక్ సాధించినట్లు పిట్జీ డైరెక్టర్ పిన్నెపు రమేష్‌బాబు తెలిపారు. విజయవాడలోని పిట్జీ క్యాంపస్‌లో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థకు, రాష్ట్రానికి పేరు తెచ్చిన తేజేశ్వర్‌ను అభినందించారు. తమ సంస్థకు సంబంధించి దాదాపు 300 మందికిపైగా విద్యార్థులు ఈ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించి ఐఐటిలో ప్రవేశం పొందారని తెలిపారు. ఇటీవల జరిగిన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో కూడా తమ విద్యార్థులు వంద శాతం విజయం సాధించారని రమేష్‌బాబు చెప్పారు.

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 306 | విజయవాడ, సోమవారం 10 జూన్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Monday 10 June 2024 | Rs



గాజాలో ఊచకోత ఆపండి

- వైట్ హౌస్ ఎదుట 'భారీ'నిరసన ర్యాలీ

7

13న బడులు తెరుస్తారు!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పాఠశాలలకు వేసవి సెలవులు ఒకరోజు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 24 నుంచి ఈ నెల 11వ తేదీ వరకూ వేసవి సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. గత ఆదేశాల ప్రకారం ఈ నెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోవాల్సి ఉంది. అదేరోజు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో ఒకరోజు పొడిగించాలని పలువురు విజ్ఞప్తి చేశారు. దీంతో పాఠశాలలు ఈ నెల 13వ తేదీన తెరచుకుంటాయని విద్యాశాఖ ఆదివారం ప్రకటించింది.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకర్ లహోటి

- సత్తాచాటిన తెలుగు తేజాలు
- మొదటి పది ర్యాంకుల్లో నాలుగు తెలుగువారికే


వేద్ లహోటి

చెన్నై: దేశవ్యాప్తంగా ఐఐటి, ఎన్ఐటి, ట్రిబుల్ ఐటిలో అడ్మిషన్ల కోసం నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ - 2024 పరీక్షల్లో మొదటి ర్యాంక్ ఢిల్లీ జోన్‌కు చెందిన 17 ఏళ్ల వేద్ లహోటి సాధించాడు. అతను తన లొలి ప్రయత్నంలోనే దీనిని సాధించడం విశేషం. అదలా ఉంచితే మొదటి పది ర్యాంకుల్లో నాలుగు ర్యాంకులు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు దక్కించుకున్నారు. ఈ సారి జెఇఇ (అడ్వాన్స్‌డ్) పరీక్షలను నిర్వహించిన ఐఐటి మద్రాస్ ఆదివారం నాడు ఈ ఫలితాలను విడుదల చేసింది. జెఇఇ (అడ్వాన్స్‌డ్) పరీక్షకు మొత్తం 1.8 లక్షల మంది విద్యార్థులు హాజరుకాగా 48,248 మంది ఐఐటీల్లో ప్రవేశానికి క్వాలిఫై అయ్యారు. వీరిలో మహిళా అభ్యర్థులు 7,964 మంది కాగా, వికలాంగులు 594 మంది ఉన్నారు. మొత్తం క్వాలిఫై అయిన వారిలో ఓపెన్ కేటగిరి నుంచి 14,083 మంది, ఒబిసికి కేటగిరి నుంచి 9,281 మంది, ఇబిసి కేటగిరి నుంచి 5,423 మంది, ఎస్‌సి కేటగిరి నుంచి 13,794 మంది, ఎస్‌టి కేటగిరి నుంచి 5,073 మంది ఉన్నారు. . మొత్తం 360 మార్కులకు 355 మార్కులను సొంతం చేసుకున్నాడు. అలాగే మహిళా అభ్యర్థుల కేటగిరిలో ఐఐటి బాంబే జోన్‌కు చెందిన ద్విజ ధర్మేష్‌కుమార్ పటేల్ టాప్ ప్లేస్‌ను సాధించారు. 360 మార్కులకు గాను 332 మార్కులు సాధించారు. ఫలితాలను జెఇఇఎడివి.ఎసి.ఇన్ అనే వైబ్‌సైట్‌లో పొందుపర్చారు.

సత్తా చాటిన తెలుగు తేజాలు

జెఇడి (అడ్వాన్స్‌డ్)లో ఈసారి కూడా తెలుగు విద్యార్థులు తమ సత్తా చాటారు. మొదటి పది



ర్యాంకుల్లో నలుగురు తెలుగు విద్యార్థులు ఉన్నారు. బోగపల్లి సందీప్ మూడో ర్యాంకు (338 మార్కులు), పుట్టి కుషల్ కుమార్ ఐదో ర్యాంకు (334 మార్కులు), కోడూరు తేజేశ్వర్ ఎనిమిదో ర్యాంకు (331 మార్కులు), అల్లడబోయిన సిద్ధిక్ సుహాస్ పదో ర్యాంకు (329 మార్కులు) సాధించారు. మే 26న నిర్వహించిన జెఇఇ పేపర్ 1, 2 పరీక్షలకు 1,80,200 మంది హాజరయ్యారు. ఉత్తీర్ణులైన వారిలో 7,964 మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఐఐటి ఢిల్లీ జోన్‌కు చెందిన వేద్ లహోటి (355), ఆదిత్య (346) మార్కులతో టాప్ టు ర్యాంకులు సాధించారు.

కంప్యూటర్ సైన్స్ చదువుతా



ఐఐటి ముంబయిలో కంప్యూటర్ సైన్స్ చదవాలని అనుకుంటున్నాను. జాతీయ స్థాయిలో 8వ ర్యాంక్, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు రావడం ఆనందంగా ఉంది. 'ఫిట్జీ' అధ్యాపకుల కృషి, తల్లిదండ్రుల సహకారం వల్లనే ఈ ర్యాంక్ సాధించాను. **-కోడూరు తేజేశ్వర్**

కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

- ప్రధానమంత్రిగా మూడోసారి మోడీ ప్రమాణం
- 72 మందితో కేంద్ర కేబినెట్
- ఎన్నికల్లో పోటీ చేయనివారికి కూడా చోటు
- టిడిపి నుంచి ఇద్దరికి కొలువులు

న్యూఢిల్లీ : కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ (73) వరుసగా మూడోసారి ప్రమాణం చేశారు. రాష్ట్రపతిభవన్‌లో ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. మోడీ ప్రమాణం చేసిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్ తదితరులు కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. ఈ దఫా కేబినెట్, సహాయ మంత్రులతో కలిపి మొత్తం 72 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం కొత్త కేబినెట్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గ్రూఫ్ ఫొటో దిగారు. ఎన్‌డిఎలో బిజెపి తర్వాత అధిక స్థానాలు సాధించిన భాగస్వామ్యపక్షాలకు ఈ దఫా కేబినెట్‌లో బెర్తులు లభించాయి. తెలుగుదేశం పార్టీ (టిడిపి) నుంచి ఇద్దరు ఎంపీలు, అలాగే బిజెపి ఆంధ్రప్రదేశ్ కమిటీ నుంచి మరో ఇద్దరు ఎంపీలకు కేంద్ర కేబినెట్‌లో చోటుదక్కింది.. ఆంధ్రప్రదేశ్‌లో 25 లోక్‌సభ స్థానాలుండగా సార్వత్రిక ఎన్నికల్లో 21 చోట్ల ఎన్‌డిఎ విజయం సాధించిన సంగతి విదితమే. టిడిపి నుంచి రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, జెడిఎస్ నుంచి హెచ్‌డి కుమారస్వామి, బిజెపి నుంచి శర్వానంద సోనోవాల్‌ను కూడా కేబినెట్‌లోకి తీసుకున్నారు.

ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి అతిథులుగా బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దాహల్ (ప్రచండ), మాల్దీవుల అధ్యక్షుడు మహ్మద్ మొయిజు తదితరులు హాజరయ్యారు. వీరేగాకుండా దేశ, విదేశాల నుంచి 8 వేల మంది అతిథులు వచ్చారు. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి డివై చంద్రచూడ్, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి



ప్రధానిగా నరేంద్రమోడీతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, హాజరైన చంద్రబాబు, నితీష్‌కుమార్, పవన్‌కల్యాణ్ తదితరులు

వెంకయ్యనాయుడు, టిడిపి అధినేత చంద్రబాబు, జెడియు అధినేత నితీష్ కుమార్, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాన్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ, ప్రముఖ సినీ నటులు షారుక్ ఖాన్, రజనీకాంత్, స్వామి చినజీయర్ సహా వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, మఠాధిపతులు హాజరయ్యారు. గత రెండు పర్యాయాల్లోనూ బిజెపి స్వతహాగా సాధారణ మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ దఫా బోటాబోటీగా కేవలం 240 స్థానాలకే పరిమితమైన ఆ పార్టీ సాధారణ మెజార్టీ అయిన 272కు ఆమడదూరంలో నిలిచిపోయింది. దీంతో ఈ దఫా టిడిపి, జెడియు వంటి కీలక భాగస్వామ్య పక్షాల మద్దతు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సివచ్చింది. గత రెండు పర్యాయాలు ఎన్‌డిఎ పక్షాలను సైతం పక్కనబెట్టి.. స్వీయబలగం చూసుకొని అత్యంత నిరంకుశ విధానాలను అమల్జేసిన మోడీ సర్కార్ ఈ దఫా భాగస్వామ్యపక్షాలతో కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మూడోసారి ప్రధానిగా ప్రమాణం చేయడంతో మోడీ సరికొత్త రికార్డులు సృష్టించారు. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ (1952, 1957, 1962) తర్వాత వరుసగా మూడు పర్యాయాలు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నేతగా మోడీ రికార్డులకెక్కారు. నెహ్రూ తర్వాత ఏ ప్రధానీ వరుసగా మూడు సార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది లేదు. గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయీ మూడు పర్యాయాలు ప్రమాణం చేసినా..ఆయన వరుసగా చేయకపోవడంతో నెహ్రూతో సమాన రికార్డు మోడీ పరమైంది. అత్యధిక కాలంలో ప్రధానిగా పనిచేసిన కాంగ్రెసేతర నేతగా కూడా మోడీ రికార్డు సృష్టించారు. 1950 సెప్టెంబరు 17న గుజరాత్‌లో జన్మించిన మోడీ..చిన్ననాటి నుంచి సంఘ్ పరివార్ రాజకీయాలతోనే ఉన్నారు. రాజకీయాల్లో ఒక్కో మెట్టు ఎక్కుతూ 2001లో తొలిసారి గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అదే సమయంలో గోద్రా రైలు దగ్ధం ఘటన అనంతరం గుజరాత్‌లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సంఘ్ పరివార్ మారణకాండ సాగించినప్పుడు మోడీనే ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ నరమేధాన్ని చూసిచూడనట్టు వదిలేయాల్సిందిగా మోడీయే ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన అభియోగాలను ఎదుర్కొన్నారు. తొలినాళ్లలో మోడీ నేతృత్వాన 'గుజరాత్ అభివృద్ధి నమూనా' గొప్పదంటూ కీర్తించిన ఉదారవాద ఆర్థిక వేత్తలు తదనంతరకాలంలో అదంతా డొల్ల అని తేల్చేశారు. కేంద్రంలో అధికారం లోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ సంస్థలను, ప్రజాస్వామ్య వ్యవస్థలను ఒక్కొటొక్కటిగా నిర్వీర్యం చేస్తూ వచ్చిన మోడీ సర్కార్ ఈ సార్వత్రిక ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనంత ప్రజాగ్రహాన్ని చవిచూశారు. దీంతో బోటాబోటీ స్థానాలతో గట్టెక్కాల్సివచ్చింది. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ మొత్తంగా 286 స్థానాలు సాధించగా బిజెపి 240 స్థానాలతో అతిపెద్ద పార్టీగా నిలిచింది. 2019లో 282, 2014లో 303 స్థానాలను స్వతహాగా సాధించిన బిజెపి ఈ దఫా సార్వత్రిక ఎన్నికల్లో తీవ్ర ప్రజాగ్రహం వ్యక్తంకావడంతో 240 సీట్లకే పరిమితమైంది.

సంధి కాలంలో ఖరీఫ్ రైతు

- వర్షాల వేళ విత్తనాల చెర
- సీమలో వేరుశనగ సమస్య
- అరకొరగా సబ్సిడీ సీడ్
- అదీ నాసిరకం సరఫరా
- ఆర్‌బికెలకు వాపస్ ఇస్తున్న వైనం
- కొత్త ఎంఎల్‌ఎలపై ఒత్తిడి



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

శాసనసభ ఎన్నికలు, కొత్త ప్రభుత్వ ఏర్పాటు.. ఈ సంధి కాలంలో ఖరీఫ్ రైతు ఉన్నాడు. గత సంవత్సరం సరైన వానల్లేక సీజన్ అస్తవ్యస్తంగా నడిచింది. పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోగా, వేసిన పంటలు నష్టపోయాయి. ఈ ఏట రుతుపవనాలు కొంచెం ముందుగా పలకరించడంతో రాయలసీమలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సరిగ్గా ఈ సమయంలో విత్తనాల సమస్య తలెత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీమలో ప్రధాన పంట వేరుశనగ. చినుకు పడగానే వేరుశనగను సాగు చేయడం రైతులకు రివాజు. కానీ వానలు పడుతున్నా విత్తనం రైతులకు తగినంతగా అందుబాటులో లేదు. సబ్సిడీ విత్తనాల సేకరణ సజావుగా జరగలేదు. ఎన్నికలు కదా ఎవరూ అడగరులే అనుకున్న అధికారులు నాసిరకం వేరుశనగ విత్తనాలను, అదీ అరకొరగా సేకరిస్తున్నారు. పంపిణీ మొదలైన నాలుగైదు రోజుల్లోనే విత్తనాలు అయిపోయాయి. మరోవైపు పంపిణీ జరిగిన చోట నాణ్యతలేని విత్తనాలిచ్చారని రైతులు ఆగ్రహంతో వాపస్ ఇస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) సిబ్బంది ఎలాగోలా రైతులను సముదాయించి పంపుతున్నారు. నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం, మంత్రివర్గ కూర్పులపై కొత్తగా గెలుపొందిన టిడిపి ఎంఎల్‌ఎలు బిజీగా ఉన్నారు. సీజన్ గడిచిపోతుందన్న ఆవేదనలో రైతులు తమకు విత్తనాలందించాలని ఎంఎల్‌ఎలపై డిమాండ్ తెస్తున్నారు. ఈ పరిస్థితి తమకు, ప్రభుత్వానికి సంకట స్థితేనన్న అభిప్రాయం అధికార టిడిపిలో వ్యక్తమవుతోంది.

గతేడాది ప్రామాణికంగా...

నిరుడు రుతుపవనాలు వైఫల్యం చెందిన కారణంగా సీమ జిల్లాల్లో సరైన వానలు పడలేదు. కరువు పరిస్థితులు నెలకొన్నాయి. సాగు విస్తీర్ణం తగ్గింది. కాగా నిరుడు ఆర్‌బికెలలో ఎంత పరిమాణంలో సబ్సిడీ విత్తనాలు అమ్మారో అంత మేరకే ఇండెంట్‌లు తీసుకొని ఆ మేరకే విత్తనాలను సరఫరా చేశారు. నిరుడు కరువు వలన మిగతా 2లో

5 రోజులపాటు వర్షాలు

- వాతావరణశాఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న ఐదు రోజులపాటు పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. అలాగే రానున్న రెండు రోజులు దక్షిణ మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, దక్షిణ ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశాతోపాటు కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని ఐఎమ్‌డి తెలిపింది. రానున్న ఐదు రోజుల్లో తూర్పు మధ్య భారతదేశం, రాజస్థాన్, మధ్యప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర, బెంగాల్, సిక్కింలలో ఉరుములు, ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో కేరళలోని పతనంతిట్ట, కోజికోడ్, వాయనాడ్, కన్నూర్, కాసరగోడ్‌లకు ఆరెంజ్ అలెర్ట్ జారీ అయింది. తిరువనంతపురం, కొల్లామ్, అలప్పుజా, కొట్టాయం, ఇడుక్కి, ఎర్నాకులం, త్రిసూర్, మలప్పురం సహా రాష్ట్రంలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు.


కె.రామ్మోహన్‌నాయుడు


పెమ్మసాని చంద్రశేఖర్


భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు

- టిడిపి నుంచి రామ్మోహన్, పెమ్మసాని, బిజెపి నుంచి శ్రీనివాస వర్మకు మంత్రి పదవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు దక్కింది. టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు మంత్రులుగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మంత్రి పదవి చేపట్టడం ముగ్గురికి ఇదే తొలిసారి. టిడిపి నుంచి శ్రీకాకుళం లోక్‌సభ ఎంపిగా గెలిచిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు కేంద్ర మంత్రిగా, గుంటూరు లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పెమ్మసాని చంద్రశేఖర్, బిజెపి నుంచి నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి గెలుపొందిన శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రామ్మోహన్‌నాయుడు వరుసగా మూడు సార్లు శ్రీకాకుళం నుంచి ఎంపిగా గెలుపొందారు. పెమ్మసాని గుంటూరు నుంచి, శ్రీనివాస వర్మ నర్సాపురం నుంచి తొలిసారి గెలుపొందారు.


పిన్న వయసులోనే కేంద్ర మంత్రిగా..

కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు, విజయలక్ష్మి దంపతులకు 1987 డిసెంబరు 18న శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో రామ్మోహన్‌నాయుడు జన్మించారు. 2012లో తండ్రి ఎర్రన్నాయుడు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో రాజకీయాల్లో ప్రవేశించి 2014 నుంచి వరుసగా మూడు సార్లు ఎంపిగా గెలిచారు. విద్యాభ్యాసం హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ప్రారంభమైంది. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిగ్రీ పట్టా పొంది లాంగ్ మిగతా 2లో

నిర్మాణంలో ఉన్న భవనాలు
త్వరలో ప్రారంభం

- అమరావతిలో 25 భవనాలను పరిశీలించిన సిఎస్
- సిఆర్‌డిఎ భవన పనులు వేగవంతం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


భవనాలను పరిశీలిస్తున్న నీరబ్‌కుమార్ ప్రసాద్

రాజధాని పరిధిలో నిర్మాణంలో ఉన్న 25 భవనాలను త్వరలో ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా ఆదివారం ఉదయం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అమరావతి పరిధిలో పర్యటించారు. నిర్మాణంలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాలుగో తరగతి ఉద్యోగులు, ఎన్‌జిఒల భవనాలను పరిశీలించారు. అలాగే రాయపూడి పరిధిలో ఉన్న సిఆర్‌డిఎ భవనంలో మొదలుపెట్టిన పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ నుండి ఉద్దండ్రాయునిపాలెంలో గతంలో ప్రధాని శంకుస్థాపన చేసిన స్థలాన్ని, సీడ్ యాక్సెస్ రోడ్డులో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. వెంకటపాలెంలో నిర్మాణంలో ఉన్న పేదల ఇళ్లను చూశారు. అనంతరం రాయపూడిలోని సిఆర్‌డిఎ కార్యాలయం సమీపంలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ముఖ్యంగా సిఆర్‌డిఎ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం అమరావతిని ప్రాధాన్యతగా తీసుకుందని, ఈ మేరకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. రాజధాని పరిధిలో పెద్దయెత్తున పిచ్చిమొక్కలు ఉన్నాయని, వాటిని 100 జెసిబిలతో తొలగిస్తున్నామని చెప్పారు. మొదటిదశలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని సిఆర్‌డిఎ కమిషనర్‌ను ఆదేశించామని తెలిపారు. కరకట్ట రోడ్డు నుండి సీడ్ యాక్సెస్ రోడ్డు, శంకుస్థాపన ప్రాంతం, సిఆర్‌డిఎ కార్యాలయం, 10 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, అపార్టుమెంట్లు, ఆలిండియా అధికారుల మిగతా 2లో

సిఎం ప్రమాణ స్వీకారోత్సవానికి
పటిష్ట ఏర్పాట్లు

- కేసరిపల్లి సభాస్థలిని పరిశీలించిన సిఎస్

అంబేద్కర్ విగ్రహానికి అవమానం

- రోడ్డుపై బైఠాయించిన దళితులు

జమ్ముకాశ్మీర్‌లో బస్సుపై 'ఉగ్ర' కాల్పులు

- అదుపు తప్పి లోయలో పడిన బస్సు
- తొమ్మిది మంది మృతి

• లోపలి పేజీలో..•

అక్షర యోధునికి అంతిమ వీడ్కోలు

- ఫిల్మ్ సిటీలో ఆయన నిర్మించుకున్న స్మారక కట్టడం వద్ద అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- పాడె మోసిన చంద్రబాబు


రామోజీరావు అంతిమయాత్రలో పాడె మోస్తున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఆదివారం ముగిశాయి. రామోజీ ఫిల్మ్ సిటీలోని విశాలమైన ప్రాంతంలో రామోజీరావు స్వయంగా నిర్మాణం చేయించుకున్న స్మృతి కట్టడం వద్ద కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు పూర్తి చేశారు. సినీ, రాజకీయ ప్రముఖులు, బంధువులు, సన్నిహితులు, రామోజీ గ్రూపు సంస్థల సిబ్బంది, అభిమానుల 'జోహార్ రామోజీరావు' నినాదాల మధ్య అంత్యక్రియలు ముగిశాయి. ఫిల్మ్ సిటీలోని నివాసం నుంచి ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పోలీస్ బ్యాండ్ నడుమ రామోజీరావు అంతిమయాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి రామోజీ గ్రూప్ సంస్థల కార్యాలయాల మీదుగా స్మారక కట్టడానికి చేరుకుంది. 'జోహార్ రామోజీ' అంటూ తుది వీడ్కోలు పలికారు. రామోజీ సంస్థల సిబ్బంది, అభిమానులు, పలు రంగాల ప్రముఖులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్ర స్మృతి కట్టడం వద్దకు చేరుకున్న తర్వాత రామోజీ భౌతికకాయాన్ని కుటుంట సభ్యులు వాహనం నుంచి కిందకు దింపారు. కుటుంబ సంప్రదాయ క్రతువులు నిర్వహించిన అనంతరం చంద్రబాబు, లోకేశ్, తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ, పలువురు సినీ ప్రముఖులు రామోజీరావుకు కడసారిగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి రామోజీరావు పాడెను చంద్రబాబు మోశారు. గౌరవ సూచకంగా పోలీసులు గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. అంతిమ సంస్కారాల అనంతరం రామోజీ రావు చితికి ఆయన కుమారుడు, ఈనాడు ఎండి సిహెచ్.కిరణ్ నిప్పంటించారు. చంద్రబాబు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

అక్షరం



"మతములన్నియు
మాసిపోవును
జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును
అంత స్వర్గ సుఖంబులన్నవి
యవని విలసిల్లున్ ..."
- గురజాడ



జన జాగృతికి జేజేలు

ఆకాశంలో విహరించే వాని
అహంకారానికి ముక్కుతాడేసి
నేల మీదికి కుదేసి గుంజకు కట్టినట్టు
రంకెలేసే ఆంబోతుకు
లెంకె పీట లేసి ఆపినట్టు
అదుపు తప్పి ఆడకుండా
పగ్గాలేసి గుంజినట్టు ...
పూట పూటకో మాటకు
పేట పేటకో వేషానికి
పాబందీలేని ఆటకి ప్రతిపక్షాల వేటకి
చదరంగంలో చెక్కుపెట్టినట్టు ...

జనం నాడి ఇదంటూ జర్నలిజం పేరుతో
వ్యాపారం చేసేటోని
మా మనసు మర్మం నీకేమీ ఎరుకని
జాడిచ్చి తన్నినట్టు
పాలకులంటే పరమాత్ములు కాదని
ప్రజాసేవకులని గుర్తెరిగేటట్టు
ప్రజాస్వామ్య దేశంలో
వ్యక్తి పూజ సరికాదన్నట్టు
పగలకు పంతాల సాధనకు
పాలకుల అవసరం లేదని
ప్రజా సమస్యలే ప్రధానం కావాలంటూ
ప్రజలంతా గుర్తించినట్టు
ప్రజా వజ్రాయుధం ఓటును
అదును చూసి పదునుగా గుద్దిన
భళి భళిరా జన జాగృతి
మన గణ జన జాగృతికి జేజేలు!

- డా.ఎడ్ల కల్లేశ్
98667 65126

వానగాడు

నల్ల మబ్బు చేతులు చాచి
నిప్పులు కక్కుతున్న
సూర్యుడి రెండు కళ్లూ మూసింది!
సలసల కాగే వేడికి నీరసపడిన నగరం
చినుకుల సందడికి
నవ్వుతూ తలెత్తింది
గొడుగులతో గంతులేసింది!

మోయలేని బరువులతో పాటు
ఎండనూ ఎత్తుకున్న
బక్కచిక్కిన దేహం
వానలో తడిసి సేదతీరింది

నెలల కష్టాన్ని మోసిన మిర్చి రైతును
వాన చితక్కొట్టి
చెవులు మూసింది!
వానగాడు భలే తుంటరి
ఏకకాలంతో
కొందరికి ఆనందం
మరి కొందరికి దుఃఖం
బహూకరిస్తుంటాడు
ఎప్పుడొస్తాడో, ఎప్పుడు మాయమవుతాడో
తెలియని మట్టి ప్రాణాలు
ఉగ్గ పట్టుకుని
నింగికి చూపులు వేళ్ళాడదీస్తాయి

- పద్మావతి రాంభక్త
99663 07777

ఎవరీ మోత దూతలు?

నిత్యం భుజానేసుకొని మోసే
పుస్తకాల సంచులు చూస్తుంటే
ఈ దేశపు భావి పౌరులు
ముఠా కూలీలా.. కాకుంటే
ఆధునిక శిలువలు సంచుల్లా
మోస్తున్న క్రీస్తులా.. కాకుంటే
సంపన్నుల బానిస లాగుడుకు
శిక్షణ పొందే భావి బాధితులా?

నాటి క్రీస్తు పేదల బాధల శిలువలు
కన్నీరు కార్చే జనం కోసం మోశారు
నేటి క్రీస్తులు సిరిమంతుల ఆవసరాన్నీ
ధనవంతుల దాహాన్నీ మోస్తున్నారు

ఈ కఠోర నిజం కన్న పేగులు చూడటం లేదు
బంగారు భవిష్యత్తే భుజాలపై ఉందనుకుంటూ
విద్యా వేలం గుంతల్లోకి దిగబడుతున్నారు
అప్పుల గనులు తోడి కప్పాలు కడుతున్నారు

లే! బాబు లే! అది స్వేచ్ఛా భవిష్యత్తు కాదనీ
ప్రభుత్వ బడుల్లో సరస్వతిని బంధించిన
కార్పొరేట్ కూతల బోధన బందిఖానా అనీ
ధనిక దేశాల్లో ప్రభుత్వ బడులు చదువు దారులని
స్వేచ్ఛా ఐచ్ఛిక బోధనే మేధకు శోధనని చెప్పు!

- ఉన్నం వెంకటేశ్వర్లు

దాశరథి శతజయంతి సంచిక కోసం...

ఈ ఏడాది జులై 22న దాశరథి కృష్ణమాచార్యులు (22 జులై 1925 – 05 నవంబర్ 1987) శతజయంతి సంవత్సరం ఆరంభం కాబోతుంది. ఈ సందర్భంగా వారిని స్మరించుకుంటూ పాలపిట్ట పత్రిక దాశరథి శతజయంతి సంచికని ప్రత్యేకంగా వెలువరించాలని భావించింది. దాశరథి కృష్ణమాచార్యులతో అనుబంధం గలవారు, వారితో తమకు ఉన్న జ్ఞాపకాలను రాసి పంపాల్సిందిగా కోరుతున్నాం. అలాగే విభిన్న సాహిత్య సంస్థల వారు, వ్యక్తులు దాశరథితో తమకు ఉన్న సాహిత్య సంబంధాలను గురించి పంపవచ్చు. దాశరథితో తాము పాల్గొన్న సభల ఫొటోలను, వారితో కలిసి దిగిన ఫొటోలను, దాశరథి రాసిన ఉత్తరాలను పంపించవలసిందిగా మనవి. దాశరథి తొలినాళ్ళ పుస్తకాల కవర్ పేజీలు కూడా పంపవచ్చు.

- గుడిపాటి

చిరునామా : ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2,
ఎం.ఐ.జి–2, ఏపిహెచ్‌బి, బాగ్ లింగంపల్లి,
హైదరాబాద్–500044.
ఫోను: 94900 99327.
palapittabooks@gmail.com


ఉద్యమ స్ఫూర్తిని రగిలించే పుస్తకం

సమీక్ష

మన దేశంలో పదేళ్ల నుంచి ప్రశ్నించే గొంతుల మీద దాడి పెరిగింది. దారుణమైన చట్టాలను ప్రయోగించి, హక్కులను కాలరాసే నిరంకుశత్వం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యమకారుడు, మార్క్సిస్ట్ కార్యకర్త ప్రబీర్ పుర్కాయస్థ వెలువరించిన పుస్తకం 'అలుపెరుగని పోరాటం' కొన్ని కర్తవ్యాలను ప్రబోధిస్తోంది. ప్రశ్నించే గొంతులకు ఉత్తేజాన్ని ఇవ్వడమే కాక, ఉద్యమాలను మరింత సమర్థవంతంగా ఎలా నిర్మించాలో వివరిస్తుంది.

2014 నుంచి దేశ ప్రజలు అప్రకటిత ఎమర్జెన్సీలో ఉన్నారు. మతం పేరుతో జరిగిన దమనకాండల్ని, అభం శుభం ఎరుగని అసీఫా లాంటి చిన్నారులపై జరిగిన అత్యాచారాలను, హత్యాచారాలను, మణిపూర్ నగ్న ఊరేగింపుల్ని దేశప్రజలు కళ్ళారా చూశారు. మన దేశంలో 1975 నుంచి 1977 వరకు 21 నెలల పాటు ఎమర్జెన్సీ కొనసాగింది. అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సలహా మేరకు అధ్యక్షుడు ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ 25 జూన్ 1975న జాతీయ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 ప్రకారం రాష్ట్రపతి అధికారికంగా జారీ చేశారు. ఈ ఎమర్జెన్సీ 21 మార్చి 1977న ముగిసింది. ఎమర్జెన్సీ ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తుంది. అలా అక్రమ కేసులో ఇరికించబడిన జెఎన్‌యు విద్యార్థి నాయకుడు ప్రబీర్ పుర్కాయస్థ. ఆయన అప్పటినుంచి ప్రజల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్నారు. మోడీ హయాంలోనూ ఆయన అక్రమంగా, అమానుషంగా అరెస్టుకు గురయ్యారు. ఇటీవలే నిర్దోషిగా విడుదలై పోరాట పిడికిలిని పైకెత్తారు.

ప్రబీర్ పుర్కాయస్థ తండ్రి కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ శాఖలో ఉద్యోగి. ఆయన దేశవ్యాప్త బదిలీల కారణంగా ప్రబీర్ విద్యాభ్యాసం స్థిరంగా ఒక్కచోట సాగలేదు. అలా తిరగడం వల్లేమో దేశ సమగ్ర భాషా సంస్కృతులు, వివిధ రాష్ట్రాల్లోని ప్రజల జీవనస్థితి గతులు తెలుసుకోగలిగారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలోనూ వారి కుటుంబం రెండున్నరేళ్ళు ఉంది. అక్కడి కేంద్ర గ్రంథాలయంలో ఆయన అనేక పుస్తకాలు అధ్యయనం చేశారు. మహాభారతం, రామాయణం బెంగాలీ



అనువాదాలు చదివారు. పురాణాల్లోని అశ్లీల సంబంధింత అంశాలను చదివి అవాక్కైనదీ ఈ పుస్తకంలో గుర్తు చేసుకున్నారు.

అలుపెరుగని పోరాటం పేరుతో ప్రబీర్ పుర్కాయస్థకు సంబంధించి నాటి ఎమర్జెన్సీ నుండి నేటిదాకా అనే పేరుతో పుస్తకం తెలుగులోనూ వచ్చింది. ఇందులో ఆయన తన జీవితంలో ఇప్పటివరకు జరిగిన ఉద్యమ జీవితాన్ని రేఖామాత్ర పరిచయం చేశారు. ప్రబీర్ పుర్కాయస్థ వృత్తిరీత్యా సాంకేతిక నిపుణుడు. ప్రజాసైన్స్ ఉద్యమకారుడు. భోపాల్ గ్యాస్ లీకేజి దుర్ఘటనలో లీకేజి కారణాలను వెలికితీసి బాధితుల తరుపున పోరాటం చేశాడు. బిహెచ్ఇల్, బిహెచ్‌పివి లాంటి ప్రభుత్వరంగ సంస్థల అభివృద్ధికి దోహదపడిన కృషిలో ప్రబీర్ భాగస్వామి. న్యూస్‌క్లిక్ అనే వెబ్ వార్తాసంస్థను ప్రారంభించి తద్వారా ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళగలిగాడు. ఇది బిజెపీ ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించింది. రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి పాలించని మనవాద పాలకులకు ప్రబీర్ అనతికాలంలోనే శత్రువుగా మారిపోయాడు. ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికిపైగా సాగిన రైతాంగ ఉద్యమం, మహారాష్ట్రలో జరిగిన రైతాంగ లాంగ్‌మార్చ్‌కు తన పత్రికలో ప్రాచుర్యం కల్పించటం మోడీ ప్రభుత్వానికి నచ్చలేదు. ఆధారాలు లేని ఆరోపణలు గుప్పించి, ఆయన్ని జైల్లో పెట్టింది. ప్రబీర్ ధైర్యాన్ని కోల్పోలేదు. తన ఉద్యమ జీవితాన్ని ఒక పుస్తకంగా రాశారు. దీనిని తెలుగులోకి బోడపట్ల రవీందర్ అనువదించగా, నవ తెలంగాణ పబ్లిషింగ్ హౌస్ ప్రచురించింది. అడ్మిరల్ రామదాస్ సతీమణి లలితా రామదాస్, ప్రఖ్యాత చరిత్రకారిణి రోమిల్లా థాపర్ ఈ పుస్తకానికి ముందుమాటలు రాశారు. పుస్తకంలో ప్రతితరం ఎమర్జెన్సీని ఎదుర్కోవాల్సిందేనా?, వ్యక్తిగత ప్రయాణంలో పోరాట పాఠాలు, ఢిల్లీకి మకాం నా జీవితానికి మూలమలుపు, ఎమర్జెన్సీ ఆధీనంలో ఓ విశ్వవిద్యాలయం, జైలు జీవితం, ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ చివరి అధ్యాయం, వర్తమాన రాజకీయాలు వంటి ఏడు విభాగాలు ఉన్నాయి. ఎస్ఎఫ్ఐ తన ఉద్యమ జీవితాన్ని ఎలా తీర్చిదిద్ది సమాజానికి అందించగలిగిందో చెప్పాడు. తన ఉద్యమ జీవితంలో జరిగిన అనేక ఆటుపోట్లు, పర్యావసానాలు వివరించాడు. నాటి ఇందిర ప్రకటిత ఎమర్జెన్సీ నుంచి నేటి మోడీ షాల అప్రకటిత ఎమర్జెన్సీ దాకా సాగుతున్న దమనకాండల్ని వివరించాడు. నాటి ఎమర్జెన్సీ వార్తను ఆ రోజుల్లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తన ఎడిటోరియల్ కాలంలో ఖాళీ స్థలాన్ని ఉంచి, నిరసన తెలిపింది. కానీ, నేటి మీడియా అంత సాహసం చేయటం లేదు. ఈ పుస్తకం ప్రబీర్ జైలు నుంచి విడుదల కాకముందే ప్రచురితమైంది.

న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్థకు ఢిల్లీ కోర్టు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో సాక్షులను, ఆమోదించేవారిని సంప్రదించకుండా, కేసు యొక్క మెరిట్ గురించి మాట్లాడకుండా, కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకుండా ఉండేలా బెయిల్ ఇచ్చింది. ఈ కేసులో సుప్రీంకోర్టు ఆయన అరెస్టు 'చెల్లదు' అని ప్రకటించి కేంద్రానికి షాక్ ఇచ్చింది. ఆయన ఏడు నెలలకు పైగా కస్టడీలో ఉన్నాడు. న్యూస్‌క్లిక్ ద్వారా చైనా అనుకూల ప్రచారానికి డబ్బును అందుకున్నారనే ఆరోపణలపై పుర్కాయస్థను అక్టోబర్ 3, 2023న ఢిల్లీ పోలీసు ప్రత్యేక విభాగం అరెస్టు చేసి, ఎఫ్ఐఆర్‌లో అతనిపై ఉపా చట్టంలోని సెక్షన్ 13 (చట్టవిరుద్ధ కార్యకలాపాలు), 16 (ఉగ్రవాద చట్టం), 17 (ఉగ్రవాద చర్యలకు నిధులు సేకరించడం), 18 (కుట్ర), 22సి (కంపెనీలు, ట్రస్టుల ద్వారా నేరాలు) కింద కేసులు నమోదు చేశారు. ప్రత్యేక విభాగం దర్యాప్తులో భాగంగా ఢిల్లీతోపాటు మరో ఏడు రాష్ట్రాల్లోని 88 ప్రాంతాల్లో దాడులు చేసింది. న్యూస్‌క్లిక్ కార్యాలయాల నుంచి దాదాపు 300 ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో చట్టపరమైన అన్నీ పద్ధతులను పోలీసులు తుంగలో తొక్కారు. అరెస్టయిన వ్యక్తి నిర్బంధానికి గల కారణాలను తెలియజేయాలి. అదేమీ చేయలేదు. అరెస్టయిన వ్యక్తి తన న్యాయవాదిని సంప్రదించకుండా అడ్డుకుంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం (యుఎపిఎ) కింద అరెస్టయిన వ్యక్తులకు దర్యాప్తు ఏజెన్సీలు ఆధారాలతో కూడిన సమాచార కాపీని అందించాలని మే 15న సుప్రీం కోర్టు ఆదేశించింది. అవన్నీ జరగనందున ఈ కేసు చెల్లదని తీర్పునిచ్చింది. జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను ప్రబీర్‌పుర్కాయస్థ కోల్పోయారు. ఇలా దేశంలో ఎంతోమంది హక్కులను బిజెపి ప్రభుత్వం హరించింది. ఆదివాసీలు, మేధావులు, జర్నలిస్టులు, పౌరహక్కుల నేతలను దేశవ్యాప్తంగా 7,607 మందిని ఈ చట్టం కింద నిర్బంధించి, విచారణ లేకుండా వేధిస్తోంది. గతంలో ప్రజా ఉద్యమాలను, ప్రజాస్వామికవాదులను అణచి వేయడానికి టాడా, పోటా లాంటి చట్టాలు తెస్తే దేశ ప్రజలందరూ పోరాడి వాటిని రద్దు చేసుకున్నారు. ఇప్పుడు కూడా అలాంటి పోరాటాన్ని చేయాల్సిన స్ఫూర్తిని ఈ పుస్తకం కలిగిస్తుంది. బిజెపీ చేస్తున్న దురాగతాలన్నీ కళ్ళకు కట్టినట్లు ఈ పుస్తకంలో పొందుపరిచారు. నవీన సమాజ ఆవిర్భావానికి కలలు కనే ప్రతి పౌరుడూ చదవదగ్గ పుస్తకం ఇది.

- కెంగార మోహన్

మణిపూర్ విషాదంపై అధ్యయనం


పుస్తకం

మణిపూర్ సంఘటనలు .. మన కాలం చూసిన మహా విషాదం! అక్కడి ప్రజలు ఉన్న చోటనే కాందిశీకులయ్యారు. శిబిరాల్లో శరణార్థులుగా మారారు. ప్రజాస్వామిక దేశంలో ఇటువంటి దృష్టాంతాలు చోటుచేసుకోవడం దారుణం. పరిస్థితులు విషమించినా పాలకులు పట్టింపులేని వ్యవహారంగా చోద్యం చూశారు, చూస్తున్నారు. ఆ నిర్లక్ష్యం ఫలితంగానే అరాచక శక్తులు ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించగలిగాయి. అయినా సరే, మన దేశ ప్రధాని స్పందించలేదు. భరోసా అందించలేదు. పైగా అక్కడి బిజెపి రాష్ట్ర ప్రభుత్వం నిజాలకు పాతరేసే పనికి పూనుకొంది.

అందుకనే, అసలు అక్కడ ఏం జరిగిందో, ఏం జరుగుతుందో తెలుసుకోవటానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఒక మహిళా బృందం నడుం కట్టింది. ఆరు రోజుల పాటు ఆ ప్రాంతాల్లో పర్యటించింది. శిథిల గోడల మాటున బిక్కుబిక్కుమంటున్న గ్రామాలను చూసింది. రెక్కల తెగిన పక్షుల్లా ఆ శిబిరాల్లో దీనంగా బతుకులను వెల్లదీస్తున్న బాధితులను పలకరించింది. వారి గాథలను "అంతర్యుద్ధంలో మణిపూర్" ఒక క్షేత్ర స్థాయి పరిశీలన పేరిట ఓ పుస్తకంగా వెలువరించింది. అంతర్గతంగా ఉన్న ఆర్థిక ప్రయోజనాలు, బహిరంగంగా సాగుతున్న రాజకీయ ప్రయోజనాలు వంటి వాటి మధ్య మణిపూర్ మండుతుందన్న ఓ వాస్తవ చిత్రానికి అద్దం పట్టింది. సామరస్యతను సాధించడంలో గానీ, రక్షణ కల్పించడంలో గానీ ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లిప్తత కొనసాగుతుందని, అందుకు అధికార పార్టీయే కారణమని పేర్కొంది.

మణిపూర్‌కి రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. క్రీస్తు శకం 33లో ఉనికిలోకి వచ్చింది. క్రీస్తు శకం 11వ శతాబ్దంలోనే రాజు లోయింబ సారధ్యంలోకి వచ్చింది. లిఖిత రాజ్యాంగం ప్రకటితమైంది. 1891 వరకూ అది అమలై, కాంగ్ లెయి పాక్ పేరుతో ఈ రాజ్యం నడిచేది. ఇటు భారత్ నుంచి అటు బర్మా నుంచి దాడులను ఎదుర్కొంది. 1847 వరకూ తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వచ్చింది. 1724లో ఆ రాజ్యం పేరు మణిపూర్‌గా మార్చబడింది. బర్మా నుంచి తనని తాను కాపాడుకునేందుకు చాలా మూల్యమే చెల్లించింది. 1891లో బ్రిటీష్ సైన్యంతో పోరాడి, ఓటమి చెందింది. అలా ఆ రాజ్యం బ్రిటీష్ పరిధిలోకి చేరింది. మణిపూర్ యువరాజు చుర్ చాందాని రాజుగా ప్రకటించింది. అలా బ్రిటీష్ ఇండియా చిత్రపటంలోకి మణిపూర్ చేర్చబడింది. తొలి నుంచి స్వతంత్రంగా బతకాలన్నది 'మణిపూర్‌'కి బలమైన కోరిక. భారత్ నుంచి బ్రిటీష్ వాళ్ళ వెళ్లిన తరువాత తమ రాజకీయ అస్తిత్వాన్ని నిలుపుకునేందుకే ప్రయత్నిస్తూనే ఉండేది. స్వంత రాజ్యాంగాన్ని రూపొందించుకుంది. ఆ సమయంలో భారత్ ప్రభుత్వంలో సంస్థానాలను విలీనం చేయాలని ఓ నిర్ణయం జరిగింది. ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. మణిపూర్ రాజు బుధ చంద్ర సింగ్‌తో 1949 సెప్టెంబర్ 21న 'భద్రత' పేరిట విలీన ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందంతో మణిపూర్... భారత్‌లో భాగం అయ్యింది.

మణిపూర్ విభిన్న సాంస్కృతిక మూలాలున్న తెగల సంగమం. రాష్ట్ర భూభాగంలో 90 శాతం కొండలతో నిండి ఉంటుంది. అక్కడ 40 శాతం మంది ప్రజలు జీవిస్తున్నారు. వారిలో అత్యధికంగా నాగాలు, కుకీలు ఉన్నారు. మిగిలిన 10 శాతం



ప్రాంతం లోయ. అక్కడ బతుకున్న వాళ్లల్లో అత్యధికులు మొయితేలు. అయితే, నాగాలు, కుకీలను తెగల సముదాయాల కింద గుర్తిస్తారు. బ్రిటీష్ కాలంలో క్రైస్తవ మిషనరీల వల్ల వాళ్లకు విద్య అందుబాటులోకి వచ్చింది. ఆ తరువాత కాలంలో మతమార్పిడి విస్తృతంగా సాగింది. మతం మారినా వారి సంప్రదాయాలను మాత్రం వదలలేదు. లోయ ప్రాంతంలో మొయితేలు అధికారిక కేంద్రమైన ఇంఫాల్‌కి చుట్టూ అల్లుకుని ఉంటారు. వీరు వలస వచ్చిన వారుగా స్థానిక చరిత్ర రికార్డు చేసింది. దూకుడు స్వభావం కలిగిన నాగాలను కట్టడి చేసేందుకు కుకీలను బ్రిటీస్ వాళ్లే తీసుకుని వచ్చారనీ, నల్లమందు పండించేందుకు అవసరమైన కూలీలుగా వీళ్లను తరలించారనీ చెబుతారు. కుకీలు ఒక్క మణిపూర్‌లోనే కాకుండా అస్సాం, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయ, బర్మా, బంగ్లాదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో కూడా అత్యధికంగా కనిపిస్తారు.

ఈ తెగల జీవన చిత్రాన్ని చూసినప్పుడు వైవిధ్యం, వైరుధ్యం చాలా కనిపిస్తుంది. కుకీ, నాగాల్లో అత్యధికులకు పోడు వ్యవసాయమే దన్ను. మిషనరీల సహకారంతో వాళ్ల పిల్లలు విద్యారంగంలోకి అడుగుపెట్టారు. దూర ప్రాంతాలకు వెళ్లి మరీ ఉన్నత చదువును అభ్యసిస్తున్నారు. కొంత అభివృద్ధినీ సాధించారు. వారి నివాసాలు పర్యాటక ప్రియులను ముగ్ధులను చేస్తాయి. మొయితేలకి కుటీర పరిశ్రమే ముఖ్య జీవనాధారం. వ్యాపార కూడలిని అంటిపెట్టుకుని బతుకుతూ ఉంటారు. రాజధానికి ఆనుకుని ఉండడం వలన వారిళ్లు అత్యంత ఇరుకుగా ఉంటాయి. ఆర్థికంగా ఒత్తిడిలోనూ ఉంటాయి.


మొయితీలు తమ ఇళ్లల్లో తయారు చేసే ఉత్పత్తులను ఇటు ఇంఫాల్ మార్కెట్లోనూ, అటు పొరుగు ప్రాంతాల్లోనూ అమ్ముకుంటారు. బయట ప్రాంతాలకు తమ సరుకులు చేర్చడం ద్వారా వారికి అధికాదాయం వస్తుంది. ఆ క్రమంలో కుకీలూ, నాగాలూ జీవించే ప్రాంతాల మీదుగానే వీళ్ల రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. అలా వెళ్లిన ప్రతిసారీ రోడ్డు టాక్సు చెల్లించాల్సి వచ్చేది. ఒకనాడు అదేమీ భారం కాలేదు. కాని, క్రమేణా పారిశ్రామిక ఉత్పత్తులు ముంచెత్తడంతో వారి ఉత్పత్తులకు గిరాకీ తగ్గుతూ వచ్చింది. టాక్సు కట్టడం వారికి భారంగా పరిణమించింది. తగ్గుతున్న వ్యాపారాల వలన మొయితీలు కూడా నల్లమందు సాగు వైపు ఆకర్షితులయ్యారు. కొందరు ఆ సాగులోకి దిగారు. మిగిలిన వాళ్లు వెళ్లేందుకు భూమి అందుబాటులో లేదు. ఆ భూమి కోసం ఎగువకి వెళ్లాల్సిన అగత్యం ఏర్పడింది. ఇది ఘర్షణలకు బీజం వేసింది. ఈ నేపథ్యంలో ఎస్టీ రిజర్వేషన్ల కోసం మొయితీలు ఆందోళన ప్రారంభించారు. అది వాదవివాదాలకు తెరదీసింది. ఆ సమయంలోనే కుకీల చేతిలో ఉన్న భూమిని రిజర్వు ఫారెస్టుగా ప్రభుత్వం ప్రకటించింది. రెండేళ్ల క్రితం వారికి ఇచ్చిన పట్టాలన్నింటినీ రద్దు చేసింది. ఈ పరిణామం నెమ్మదినెమ్మదిగా కుకీలూ, మొయితీల మధ్య వివాదంగా రూపాంతరం చెందింది. ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం వల్ల పది జిల్లాల్లో అగ్గి రాజుకుంది. అదింకా మండుతూనే ఉంది. ఈ విద్వేష వాతావరణంలో చిన్న రైతుల ఘోష, చేతి వృత్తిదారుల విలాపం ఎవరికీ వినిపించకుండా పోయింది.

వాస్తవానికి, ఈ ప్రాంత రాజకీయం బతికేది నల్లమందు మీదనే అని ఈ బృందం చేసిన ఇంటర్వ్యూలు ప్రస్ఫుటపరుస్తాయి. మాదక ద్రవ్యాల కేసులో ఒక రాజకీయ నాయకుడిని అరెస్టు చేసినందుకు ఎన్ఎబిలో ఎఎస్‌పిగా పనిచేసిన బృందా తవునోజమ ఉద్యోగాన్ని వీడాల్సి వచ్చింది. అక్కడ మిలిటెంట్ గ్రూపులకు కొదవలేదు. కొందరు స్వతంత్రత కోసం, మరికొందరు కేంద్ర పాలిత ప్రాంతం కోసం, ఇంకొందరు ప్రత్యేక ప్రాంతాలుగా ప్రకటించాలని పనిచేస్తున్నారు. రోడ్డు టాక్సుల మీద, నల్లమందు వ్యాపారం మీదనా, సాధారణ వ్యాపారాల మీదనా ఆ సంస్థలు ఆధారపడి మనుగడ సాగిస్తున్నాయి. తెగలుగా చీలిన ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయింది. దీంతో ముఖ్యంగా కుకీలు చెట్టుకొకరు, పుట్టకొకరుగా చెదిరిపోయారు. అధికారిక పార్టీ వారి పట్ల పరాయి భావనతో ఉంది. దక్షిణ భారత క్రైస్తవ సమాజం వారికి ఆసరా నిలిచింది. ఇంఫాల్ నుంచి అందుతున్న ఆర్థిక సాయంతో మొయితీలు కాలం వెల్లదీస్తున్నారు. శరణార్థి శిబిరాల్లోనూ తమ చేతి వత్తులను కొనసాగిస్తున్నారు. ఈ మొత్తం పరిణామాల్లో కార్పొరేట్లకు సహజ వనరులను కట్టబెట్టాలన్న కుట్ర కూడా ఉందని ఒక సీనియర్ నాయకుడు చెప్పాడు.

ప్రభుత్వాలు సరైన జోక్యం చేసుకుంటే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదు. నిర్దిష్ట పరిస్థితుల మీద నిర్దిష్ట అభిప్రాయాలను వ్యక్తం చేయాల్సిన వారు సైతం అస్తిత్వ భావనకు గురవుతున్న ధోరణి ఆ సమూహాల్లో చూశామని పరిశీలకులు రాశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీన్నొక మత ప్రాతిపదిక ఘర్షణగా చూస్తున్నంత కాలమూ దీనికి పరిష్కారం దొరకదు. మనుషులను మనుషులుగా చూసి, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పే బాధ్యతను పాలకులు తీసుకోవాలి. ఇంత ఆధునిక కాలంలో ఈ అమానుష కాండ సాగటం సిగ్గుచేటని, అమానవీయమని గుర్తించాలి. మణిపూర్ చరిత్రను, నేపథ్యాన్ని, వర్తమానాన్ని కళ్లకు కట్టే ఈ రచన అందరూ చదవదగినది.

- వి.ఎం.కె.లక్ష్మణరావు
94417 49192

'నిశ్శబ్దంగా' చొచ్చుకెళ్లే కవితా చైతన్యం



'నిశ్శబ్ద ప్రవాహం' పేరిట వచ్చిన కవయిత్రి శాంతికృష్ణ వెలువరించిన కవితా సంపుటిలో– కవితల హోరు మృదువైన శైలితో మనసుకు హత్తుకుపోయేలా సాగింది. ఈ కవయిత్రి తెలుగు సాహితీవనం వ్యవస్థాపకురాలు. గతంలో 'చినుకు తాకిన నేల', 'స్వప్నధార'; ఇప్పుడు 'నిశ్శబ్ద ప్రవాహం...' కవితా సంపుటాలను వెలువరించారు. స్నేహం, ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలు .. వంటి మృదు భావనలు ఈ ఈమె కవిత్వానికి దినుసులు. అలాగే ఈ సంపుటిలో వివిధ సామాజిక అంశాలపైనా కలం సంధించారు.

"ముచ్చటపడి నువ్వు సైకిలడిగితే / సెలవు రోజు కూడా / అమ్మ తలపై సిమెంటు తట్ట లేచింది" అని 'శిలగా మారిన అమ్మ' కవితలో అమ్మ పడే కష్టం మన కళ్లకు కట్టించారు కవయిత్రి. వానలు లేక తాగునీరు సహితం కరువై అల్లాడుతున్న రాయలసీమ చిరునామాను ఎవరైనా చెప్పండి... మీ ఊరి నదికి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూనే 'కరుణించిన ఏ వాన మబ్బో ఆ దారంట పయనిస్తే, ఏడ నుంచొస్తాయో మాయదారి గాలులు/ మబ్బులకు మాయమాటలు చెప్పి దారి మళ్ళిస్తుంటాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు– 'ఎవరైనా చెప్తారా' కవితలో. శ్రామికుల గురించి ఒక కవితలో రాస్తూ, 'ఎన్ని యుగాలు మారాలో నువ్వు జగాన రాజవ్వాలంటే' అన్నారు. 'మరచిన ఉత్తరం' కవితలో అమ్మ ఆశీస్సుల ఉత్తరం, నాన్న ఆదేశాల ఉత్తరం, మిత్రుడి మురిపాల ఉత్తరం గురించి నెమరేసుకున్నారు. "అవును 'ఆమె' ఒక ఆమని/ 'ఆమె' ఎప్పుడూ ఆమనే/ పసితనం నుండే అలవాటేమో క్షమాగుణం/ అందుకే 'ఆమె' ద్వేషాగ్నులు తెలియని ఓ హిమనీ నదం" అని చాలా చక్కగా 'ఆమె'ను అభివర్ణించారు.

'బతుకమ్మ బతుకునీయమ్మా / రక్షణ కోల్పోతున్న అతివలకు/ బతుకు నీయవమ్మా / మహిళల జీవితాలకు భరోసా నీయవమ్మా' అంటూ ఓ కవితలో బతుకమ్మని వేడుకున్నారు. 'ఇప్పుడో కొత్త లాకర్ కావాలి/ పుట్టిన మరుక్షణమే పాపాయిలను అందులో దాచుకోవాలి' అంటూ ఇంకో కవితలో ఆవేదన చెందారు. లింగ సమానత్వం చూపని సమాజంపై ధర్మాగ్రహం ప్రదర్శించారు. "మాయమవుతున్న మానవత్వపు ఆనవాళ్ళని రేపటితరం పుస్తకాల్లో చదువుకోవాలేమో/ ఒకప్పుడు మనుషుల్లో మానవత్వం ఉండేదని" అంటూ చాలా కలత చెందారు 'పూలరెక్కలు' కవితలో. కుటుంబ విలువల గురించి ఎంతో గొప్పగా వివరించారు 'ఆలంబన" కవితలో.

"అమ్మంటే మన అమ్మే కాదు; జంతువు కూడా అమ్మే. లేశమైనా కానరాని మానవత్వాన్ని చూసి మృగాలెంత భయపడుతున్నాయో" అంటూ ఆవేదన చెందారు 'ఓ అమ్మ' కవితలో. 'ఋణ బంధం' కవితలో మహిళ గురించి ... 'పేగుబంధం కోసం ప్రాణగండం లెక్క చేయని అమ్మవు నీవు/ మహిలో అద్భుత ఆవిష్కరణవు నీవు/ మనిషి తీర్చుకోలేని ఆజన్మ ఋణబంధం నీవు" అని అద్భుతంగా చెప్పారు.

'అక్కడి నేలలోనూ కొన్ని నీళ్ళుంటాయి, అవి రైతులు కార్చిన కన్నీళ్ళు' అంటూ రాయలసీమ దుస్థితిని కళ్ళకు కట్టారు– ఒక చోట. పరువు హత్యలకు చలించిన ఈ కవయిత్రి 'కన్నీటికి కరగని పెద్దరికాలు కడుతున్నాయి కులమత గోడలు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'బతికింది చాలు బావిలో కప్పలా' అంటూ గర్జించారు. 'పక్క దేశపోడు ఎదిగెదిగి పోతుంటే, కులపోడికి ఓట్లేసి, కులపోడితో వియ్యమంది, కులపు గజ్జి కుక్కలా నువ్వు కుయ్యి కుయ్యి మంటున్నావు, బావిలో కప్పలా అక్కడే చచ్చావు' తీవ్ర స్వరమూ వినిపించారు. "బతకాలంటే క్షణ క్షణం మరణించడం కాదు, మరణించేంత వరకూ జీవించడమే, కష్టమైనా ప్రయత్నించాలి" అంటూ 'నా కోసం నేను' కవితలో.చక్కని సందేశం ఇచ్చారు. 'రియల్టర్ల చేతిలో మైనపు బొమ్మల్లా కరిగిపోతున్న పచ్చని పొలాల సోయగాలని తిలకిస్తూ, "ఇపుడేమైపోయాయో పంటలతో పచ్చగా అలరారే నా పల్లె ఆనవాళ్ళు' అని తలపోస్తూ వాపోయారు. 'మర్రిచెట్టు మనకెపుడూ బోధిస్తూనే ఉంటుంది తనలా ఉన్నతంగా ఎదగమని, మానవత్వంతో పరిమళించమని, మంచితనమనే ఔషధాన్ని అందరికి పంచమని' – అని చెట్టు నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలను వల్లెవేశారు. అంటరానితనాన్ని కరోనాతో పోల్చి ఇప్పుడు "మనకి మనమే అంటరాని వాళ్ళ మయ్యాము, ఈ లోకంలో ఒంటరి వాళ్ళ మయ్యాము" అని అంటరానితనం గుండెలకెంతటి రంపపుకోతో వివరించారు. 'సహనపు సంకెళ్ళు' కవితలో ఈ కవయిత్రి స్వరం రౌద్రంగా మారింది. "ఓ శ్వేత కుసుమమా/ అణచివేతకు కాలం చెల్లిందని తెలుసుకో" అని అమెరికాను గద్దించారు. 'నీ అహంకారం సమాధి చేస్తాం' అని హెచ్చరించారు. 'విప్లవం ఎప్పుడూ అచేతనం కాదు' అని ఉరిమి చెప్పారు. చిన్న చిన్న పదాలతో పదునైన, హృద్యమైన భావాలతో ఈ కవితా సంపుటి పరిమళించింది. రూ.100 వెల ఉన్న ఈ కవితా సంపుటి కోసం కవయిత్రిని 95022 36670 నెంబర్లో సంప్రదించొచ్చు.

- అరుణ నాయుడు తోట
63019 30055

ప్రధాని మోడీకి జగన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

వైఎస్ విగ్రహాలపై దాడులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

- పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్‌ఆర్ విగ్రహాలపై దాడులు చేస్తున్న అల్లరి మూకలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి అరాచకాలు జరగడం అత్యంత దారుణం, శోచనీయమని పేర్కొన్నారు. తెలుగు వారి ప్రజాదరణ పొందిన నాయకుడు వైఎస్‌ఆర్ అని, అటువంటి నేతకు నీచ రాజకీయాలు ఆపాదించడం సరికాదని తెలిపారు. ఇలాంటి రౌడీ చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు.

బందర్ పోర్టు నిర్మాణంలో వేగం పెరిగేనా?

- ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభావం
- ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఏ వైఖరి తీసుకోనుందో?



కూటమి ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయంపై పోర్టు నిర్మాణం ఆధారపడి ఉంటుందనే చర్చ జరుగుతోంది.


ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి

కృష్ణా జిల్లా పారిశ్రామికావృద్ధికి దోహదపడే బందరు పోర్టు నిర్మాణ పనులపై ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రభావం పడుతోంది. 2008లో ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన జరిగిన ఈ పోర్టు నిర్మాణం నేటికీ పూర్తవ్వలేదు. నూతనంగా అధికారం చేపట్టనున్న కూటమి ప్రభుత్వం పోర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చర్చ జరుగుతోంది. తొలిదశలో బందరు పోర్టులో నాలుగు బెర్తుల నిర్మాణ పనులు 2023 మేలో ప్రారంభమయ్యాయి. మెఘా ఇంజనీరింగ్ సంస్థ రూ.3,669 కోట్లకు కోడ్ చేసి కాంట్రాక్టు పనులను దక్కించుకుంది. 13 నెలల కాలంలో రూ.850 కోట్ల పనులను పూర్తి చేసింది. ఇందుకుగానూ కాంట్రాక్టు సంస్థకు రూ.571.56 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. మొదటి దశ పోర్టు నిర్మాణ పనులు 2025 అక్టోబర్‌కు పూర్తవ్వాల్సి ఉంది. అంటే, సగటున నెలకు రూ.152 కోట్లు పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుత నెలకు సగటున రూ.65 కోట్లు పనులు జరుగుతున్నాయి. 2008లో పోర్టు కాంట్రాక్టు పనులు దక్కించుకున్న మైటాస్ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దీంతో, పోర్టు పనులు ప్రారంభం కాలేదు. 2019 ఫిబ్రవరి 7నలో పోర్టు నిర్మాణ పనులను అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతి (బిఒటి)లో పోర్టు నిర్మాణానికి నవయుగ కంపెనీతో టిడిపి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ కంపెనీ పోర్టు నిర్మాణ ప్రాంతానికి భారీ యంత్రాలను తరలించింది. తర్వాత అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పోర్టు నిర్మాణ పనులను నిలిపివేసింది. నవయుగతో ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దు చేసుకుంది. కంపెనీకి, ప్రభుత్వానికి మధ్య కోర్టు వ్యాజ్యాలు నడిచాయి. మూడున్నర ఏళ్లు గడిచిపోయాయి. కోర్టు తీర్పు అనంతరం ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ (ఇపిసి) పద్ధతిలో ప్రభుత్వమే నిర్మించేందుకు ముందుకు వచ్చింది. కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు పూర్తయ్యాక పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణం మంజూరు చేసింది. మెఘా ఇంజనీరింగ్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. తాజాగా మరోసారి ప్రభుత్వం మారింది. నూతన ప్రభుత్వం ఈ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటే పోర్టు సకాలంలో పూర్తవుతుంది. కొత్తగా ఏర్పాటు కానున్న కూటమి ప్రభుత్వం తీసుకోనున్న నిర్ణయంపై పోర్టు నిర్మాణం ఆధారపడి ఉంటుందనే చర్చ జరుగుతోంది.

రెంటచింతలలో డయేరియా

- ఒకరు మృతి

ప్రజాశక్తి - రెంటచింతల (పల్నాడు జిల్లా)


పేరూరి చిన్నచంద్రయ్య

పల్నాడు జిల్లా డయేరియా ప్రభలింది. రెంటచింతల మండలంలో ఆదివారం డయేరియాతో ఒకరు మృతి చెందగా, ముగ్గురు ఆస్పత్రిపాలయ్యారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వడ్డెర బావికి చెందిన పేరూరి చిన్నచంద్రయ్య (72) శనివారం మధ్యాహ్నం నుంచి వాంతులు, విరోచనాలతో బాధపడుతుండగా కుటుంబీకులు స్థానిక మెడికల్ షాప్‌లో మందుల తెచ్చి ఇచ్చారు. పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. చంద్రయ్య ఇంటికి ఎదురుగా ఉండే యామర్తి తిరుపతమ్మ, ఆమె కుమార్తె హవేలీ, సమీపంలో నివాసముండే ఆత్మకూరి లక్ష్మయ్య డయేరియా బారిన పడటంతో వారిని హుటాహుటిన ఆస్పత్రుల్లో చేర్పించారు. మాచర్లలోని ప్రయివేటు ఆస్పత్రిలో ఇద్దరు, పిడుగురాళ్లలో ఒకరు చికిత్స పొందుతున్నారు. వర్షాల నేపథ్యంలో బోర్లలో నీరు కలుషితమైందని, ఆ నీటిని తాగడంవల్లే డయేరియా బారిన పడ్డారని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను ఏళ్ల తరబడి శుభ్రం చేయకపోవడమూ మరోకారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే గ్రామంలోని రైలుపేట ప్రాంతంలో కొద్ది వారాల కిందట కొంతమంది డయేరియా బారిన పడగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.


మోదకొండమ్మ ఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న యాత్రికులు

ఘనంగా మోదకొండమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో మోదకొండమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, మోదకొండమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు కుటుంబీకులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. యాత్రికులతో కలిసి అమ్మవారి ఆలయం నుంచి శతకం పట్టు వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను, ఘటాలను తలపై ఉంచుకొని ఊరేగింపుగా వెళ్లారు. డప్పు వాయిద్యాలు, గిరిజన నృత్యాలు, గరగల డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను శతకంపట్టు వద్ద ప్రతిష్ఠించారు. వేలాది మంది యాత్రికులు పాడేరుకు వచ్చి శతకం పట్టు వద్ద కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. కొలువు ఉత్సవంలో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఘటాల ఊరేగింపు కన్నుల పండవగా సాగింది. శతకం పట్టు వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది. తాగునీటి కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. ఎఎస్‌పి ధీరజ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంబేద్కర్ విగ్రహానికి అవమానం

రోడ్డుపై బైఠాయించిన దళితులు


రోడ్డుపై బైఠాయించిన దళిత యువకులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆ మహనీయునికి ఘోర అవమానం జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకో వాలంటూ దళిత యువకులు ఆందోళన చేశారు. కె గంగవరం మండలంలోని ఎర్రపోతవరంలో అంబేద్కర్ విగ్రహానికి శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చెప్పుల దండలు వేశారు. దళితులను, స్థానిక వైసిపి సర్పంచ్ పిల్లి రాంబాబును ఉద్దేశించి అసభ్య రాతలతో పోస్టర్లను అతికించారు. ఆదివారం ఉదయం దళిత యువకులు దీనిని గమనించి ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. డిఎస్‌పి రామకష్ణ సిబ్బందితో అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పారు. ప్రస్తుతం సెక్షన్ 30 అమలులో ఉందని ఆందోళనను సత్వరమే విరమించాలన్నారు. దీనిపై విచారించి దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దీంతో దళితులు ఆందోళన విరమించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఉన్న చెప్పుల దండలు, పోస్టర్లను తొలగించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పెట్టా శ్రీనివాసరావు, రవ్వా భూషణం, సర్పంచ్ అంబటి తుకారం, మాజీ సర్పంచ్‌లు దున్న అన్నవరం, ఈరేల్ల రాజు, నాయుడు, విప్పర్తి బాబురావు, చెల్లె సూర్యారావు, పోతు వెంకట్రావు, సుధాకర్ పాల్గొన్నారు.

రాతలపై వైసిపి సర్పంచ్ ఆగ్రహం

తనను ఉద్దేశించి అసభ్య పదజాలంతో లెటర్ రాసి వేలాడ దీయడంపై వైసిపికి చెందిన సర్పంచ్ పిల్లి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యర్థులు రాజకీయ కక్షతోనే ఈ పని చేశారని అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.


కావాలనే బురద జల్లుతున్నారు: టిడిపి నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి అవమానిస్తూ ఉత్తరాలు రాయడం వెనక వైసిపి నాయకులే ఉన్నారని, టిడిపిని అభాసుపాలు చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని టిడిపి నాయకుడు రవ్వా భూషణం ఆరోపించారు.

కెవిపిఎస్ ఖండన

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేయడాన్ని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఒక ప్రకటనలో ఖండించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిపిఎం సీనియర్ నాయకులు సత్యనారాయణరాజు కన్నుమూత



ప్రజాశక్తి - పాలకొల్లు

సిపిఎం సీనియర్ నాయకులు, వ్యవసాయ కార్మిక ఉద్యమ నేత కూనపరాజు సత్యనారాయణరాజు (సత్తిరాజు) (80) మృతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం అరట్లకట్ట గ్రామంలోని ఆయన స్వగృహంలో ఆదివారం కన్నుమూశారు. ఆయనకు భార్య సత్యవతి, కుమారుడు సుందరయ్య ఉన్నారు. సత్తిరాజు తుదిశ్వాస వరకూ సిపిఎం కార్యకర్తగా పనిచేశారు. ఆయన భార్య సత్యవతితో వ్యవసాయ కార్మికుల జీవనగతులు పెంచడాని కి నిత్యం పోరాటం చేశారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు వలవల శ్రీరామ్మూర్తి, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం నేతలు పార్టీ జెండాను సత్తిరాజు మృతదేహంపై కప్పి నివాళులర్పించారు. ఆయన వ్యవసాయ కార్మిక ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. సత్తిరాజు అంత్యక్రియలను కుటుంబ సభ్యులు ఆదివారం సాయంత్రం నిర్వహించారు.

వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం సంతాపం..

సత్తిరాజు మృతి పట్ల అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం మాజీ ఎమ్మెల్యే రుద్రరాజు సత్యనారాయణ రాజు (ఆర్ఎస్), మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి, కేతా సూర్యారావు, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ రవి, మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, సిపిఎం నాయకులు సిహెచ్ సోమేశ్వరరావు, కె బలరాం, టి కోటేశ్వరరావు, తిరుమల రాజు, వలవల రవి సంతాపం తెలిపారు. సత్తిరాజు సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, నర్సాపురం, పాలకొల్లు డివిజన్ కమిటీ సభ్యునిగా, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ నాయకునిగా అంకితభావంతో, క్రమశిక్షణతో పనిచేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి బి బలరాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సత్తిరాజు ఇటీవల ప్రమాదంలో గాయపడడంతో కాలికి సర్జరీ జరిగి చాలా ఇబ్బంది పడి కోలుకుంటున్న తరుణంలో ఆకస్మికంగా మృతి చెందారని తెలిపారు. ఆయన మృతి సిపిఎంకు, ప్రజా సంఘాలకు, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని పేర్కొన్నారు. సత్తిరాజుకు సిపిఎం జిల్లా కమిటీ తరపున ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

త్వరలో ఇఎపిసెట్ ఫలితాలు

- ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఎపి ఇఎపిసెట్)-2024 ఫలితాలు త్వరలో విడుదల కానున్నాయి. ఈ పరీక్ష పేపర్ల మూల్యాంకనం ముగిసింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం లేకపోవడంతో ఈ ఫలితాలు నిలిచాయి. ప్రభుత్వ అనుమతి కోసం ఉన్నత విద్యామండలి, సెట్ కన్వీనర్ ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 142 పరీక్ష కేంద్రాల్లో మే 16 నుంచి 23 వరకు జరిగిన పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 3,62,851 మంది దరఖాస్తు చేసుకోగా, 3,39,139 (93.47 శాతం) మంది హాజరయ్యారు. ఇంజనీరింగ్ విభాగానికి 2,74,213 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 2,58,373 (94.22 శాతం) మంది హాజరయ్యారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 88,638 మంది దరఖాస్తు చేసుకోగా, 80,766 (91.12 శాతం) హాజరయ్యారు. పేపర్ల మూల్యాంకన ప్రక్రియ ముగిసిందని ఉన్నత విద్యామండలి అధికారులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఫలితాలు విడుదల చేస్తామంటున్నారు.

వన్నెపూడి ఘటనలో బాధ్యులపై చర్యలు : నాగబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



పిఠాపురం నియోజకవర్గం వన్నెపూడి ఉదంతంపై వివరాలు సేకరిస్తున్నామని, పార్టీకి సంబంధించిన వ్యక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు తేలితే, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కె నాగబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తాటిపర్తిలో జరిగిన సంఘటన గురించి కూడా సమాచారం ఉందని, ఈ విషయంపై పిఠాపురం కో-ఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం స్థానిక నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ కృషి చేయనున్నారని నాగబాబు పేర్కొన్నారు. సుద్దగడ్డ రిజర్వాయర్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. జనసేన పార్టీ కార్యకర్తలు సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అప్పుల బాధతో పురుగులమందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పూల్‌సింగ్ నాయక్ తండాలో ఆదివారం జరిగింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాథోడ్ సుభాష్ (45) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో గతేడాది పత్తి సాగు చేశారు. అతివృష్టి, అనావృష్టితో పంట దిగుబడి రాకపోవడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక కలత చెంది ఆదివారం తన ఇంటి సమీపంలో పురుగులమందు తాగి పడిపోయారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ను బోథ్ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. రైతుకు బ్యాంకులో రూ.1.5 లక్షలు, ప్రయివేటుగా రూ.1.5 లక్షలు మొత్తం రూ.3 లక్షలు అప్పు ఉన్నట్టు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

రైతు బతుకే దేశ ప్రగతి

'రైతు మారాజు' పుస్తకావిష్కరణ సభలో వక్తలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ప్రజాశక్తి- అనంతపురం

రైతు లేకపోతే ఏ దేశమైనా ప్రగతిని సాధించలేదని పలువురు వక్తలు అన్నారు. మార్తాటి ఈశ్వరీగోపాలరావు రచించిన 'రైతు మారాజు' పుస్తకావిష్కరణ సభ అనంతపురంలోని ఎన్‌జిఒ హోంలో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు జి. బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రముఖ కవి, విమర్శకులు, పుస్తక సమీక్షకులు తూముచర్ల రాజారామ్ మాట్లాడుతూ రైతు మారాజు కావ్యం రైతు జీవితం, మట్టి వాసన, పల్లెటూరు సోయగాలు, రైతుతో ముడిపెట్టిన జీవితం కనిపిస్తుందన్నారు. ఆచార్య బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ రైతు నూతన సాంకేతిక వ్యవసాయంలో నవీన పద్ధతులను చేపట్టాలని రచయిత ఈ కావ్యంలో పేర్కొన్నారని వివరించారు. జనప్రియ కవి ఏలూరు యంగన్న మాట్లాడుతూ రైతు మారాజు కావ్యంలో రచయిత పశుసంపదను దేశ సంపదగా కీర్తిస్తాడని, ఎరువుల కల్తీని ఎండగట్టాడని పేర్కొన్నారు. మరో కవి సి.రాము మాట్లాడుతూ గోపాలరావు కవి మాత్రమే కాదని, మంచి సామాజిక నాటకాలు రాసి ప్రజల్లో చైతన్యవంతం కలిగించాడని కొనియాడారు. పుస్తక రచయిత మార్తాటి ఈశ్వరీ గోపాలరావు మాట్లాడుతూ కరువుకు కారణం వర్షాలు రాకపోవడం ఒక్కటే కారణం కాదని, కర్షక వృత్తి భంగం కావడం కూడా కారణమని పేర్కొన్నారు. ఏ దేశమైతే రైతును గౌరవిస్తుందో ఆ దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంత కవులు వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి, తెలుగు వెలుగు వ్యవస్థాపక అధ్యక్షులు టివి రెడ్డి తదితరులు ప్రసంగించారు. అక్షర యోధుడు రామోజీరావు మరణం పట్ల పుస్తకావిష్కరణ కార్యక్రమ ప్రారంభంలో సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.


గుడి వద్ద ఆందోళన చేస్తున్న టిడిపి నాయకులు

గుడి నిర్వహణపై టిడిపి, జనసేన ఘర్షణ

ప్రజాశక్తి -పిఠాపురం

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణ దేవి గుడి నిర్వహణ బాధ్యతల విషయంలో టిడిపి, జనసేన పార్టీ నాయకుల మధ్య ఆదివారం ఘర్షణ చోటు చేసుకుంది. ఎన్నికల్లో ఎవరు అధికారంలోకి వస్తే వారికి నిర్వహణ బాధ్యతలు అప్పగించడం అనవాయితీగా వస్తోంది. ఇప్పటి వరకు గుడి నిర్వహణ బాధ్యతను వైసిపి గ్రామ వైస్ సర్పంచ్ డి వెంకటేష్, గుడి చైర్మన్ జి బుజ్జి చూసేవారు. ఎన్నికల ఫలితాల అనంతరం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా గెలవడంతో శుక్రవారం గుడి నిర్వహణ బాధ్యతలు చూసేందుకు టిడిపి, జనసేన పార్టీల నాయకుల సమక్షంలో గుడి తాళాలను జనసేన పార్టీకి చెందిన కె సత్యనారాయణకు అందజేశారు. ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని పాటించి జనసేన గెలుపు కోసం తాము కష్టపడి పని చేశామని, గుడి నిర్వహణ బాధ్యతలు తమకే అప్పగించాలని టిడిపి నాయకులు వాగ్వా దానికి దిగారు. మాటామాటా పెరిగి తోపులాటకు దారి తీసింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. గుడి ఎదుట టిడిపి నాయకులు ఆందోళనకు దిగారు. దీంతో డిఎస్‌పి కె హనుమంతరావు అక్కడికి చేరుకుని ఇరు గ్రుపులతో చర్చలు జరిపారు. గుడి నిర్వహణపై గొడవలకు తావు లేకుండా ఇరు గ్రూపులు కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అప్పటివరకు నిత్యం దూపదీప నైవేద్యాలు, పూజా కార్యక్రమాల బాధ్యతలు విఆర్‌ఒ చూస్తారని చెప్పడంతో ఇరు పార్టీల నాయకులు సమ్మతించారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్యకు టాప్ ర్యాంక్‌లు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో తమ విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో అగ్ర ర్యాంకులు దక్కాయని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో తమ విద్యార్థులు పది లోపు ఐదు ర్యాంకులు సాధించారన్నారు. ఒక్కటవ ర్యాంక్‌తో పాటు ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 4,5,6,9,10,12,14 ర్యాంకులతో శ్రీచైతన్య ఆధిపత్యాన్ని కొనసాగించిందన్నారు. ఆలిండియా స్థాయిలో రాఘవ శర్మ 1వ ర్యాంక్, రిథమ్ కేడియా 4వ ర్యాంక్, పుట్టి కుశాల్ కుమార్ 5వ ర్యాంక్, రాజదీప్ మిశ్రా 6వ ర్యాంక్, ధృవిన్ హేమంత్ దోషి 9వ ర్యాంక్, సిద్విక్ సుహాన్ 10వ ర్యాంక్‌ల్లో నిలిచారని వెల్లడించారు. 100లోపు 30 ర్యాంక్‌లు, 1000 లోపు 202 ర్యాంక్‌లు, వివిధ కేటగిరీల్లో 100 లోపు ఏకంగా 146, 1000 లోపు 721 ర్యాంక్‌లు సాధించామన్నారు. జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో 3,728 మంది శ్రీచైతన్య విదార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఈ దఫా ఐఐటిల్లో తొలి వరుసతో పాటు మొత్తం సీట్లలోనూ అత్యధిక శాతం శ్రీచైతన్యదేనని చెప్పారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి సుష్మ అభినందనలు తెలిపారు.



ఐఐటి జెఇఇ అడ్వాన్స్‌డ్ విజేతలు, శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ

ఇద్దరు స్నేహితులు



రాజు, రాము ఇద్దరూ స్నేహితులు. వారిద్దరికీ క్రికెట్ అంటే చాలా ఇష్టం. రాజు బాగా చదువుతాడు. రాము చదువుని కొంచెం నిర్లక్ష్యం చేస్తాడు. పరీక్షలప్పుడు కూడా చదువుకోకుండా క్రికెట్ ఆడేవాడు. వాళ్ల నాన్నకి ఇది నచ్చేది కాదు. ఒకసారి పరీక్షల్లో రాముకి బాగా తక్కువ మార్కులు వచ్చాయి. రాజు ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు. రాము క్రికెట్ ఆడుతూ చదువును నిర్లక్ష్యం చేశాడని వాళ్ల నాన్నకి తెలిసి బాగా తిట్టాడు. తరువాత మాస్టారు, రాముకు క్రికెట్లో ఆసక్తి ఉంది కాబట్టి ఆటలో శిక్షణ ఇప్పించమని సలహా ఇచ్చారు. దీంతో, రాము వాళ్ల నాన్న, మంచి కోచ్ దగ్గర రాముని చేర్చాడు.



శిక్షణలో రాణించిన రాము చిన్న చిన్న మ్యాచ్‌ల నుండి పెద్ద పెద్ద మ్యాచులు ఆడే స్థాయికి ఎదిగాడు. అదే సమయంలో రాజు బాగా చదువుకుని ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఒకసారి పెద్ద స్టేడియంలో క్రికెట్ మ్యాచ్ చూడడానికి రాజు అక్కడికి వెళ్లాడు. అక్కడ టీమ్‌కి నేతృత్వం వహిస్తున్న రాముని చూసి చాలా సంతోషించాడు. తన స్నేహితుడు ఎంతో పెద్ద స్థాయికి వెళ్లాడని చాలా గర్వపడ్డాడు. ఆట ముగిశాక రామునికలిసి అభినందనలు చెప్పాడు. చాలా రోజుల తరువాత కలిసిన స్నేహితులిద్దరూ చిన్న నాటి ముచ్చట్లు చెప్పుకున్నారు.

– బోయిని నందిని,
9వ తరగతి,
జక్కాపూర్, సిద్దిపేట జిల్లా,
99590 07914.

బం బ: భలే భలే!

బడికి వెళ్లే బంగారు
బాల బాలికలం
బిరుదులు పొందే పిల్లలుగా
బీజాలు వేస్తాం!

బుద్ధిశాలులమౌతాం
బూరెలు తింటాం
బెత్తం దెబ్బలు తినని
బేబీలుగా ఉంటాం !

బైట ఎన్నో ఆటలాడుతాం
బొజ్జ నిండా మెక్కుతాం
బోధించే గురువులను గౌరవిస్తాం
భౌ భౌ అంటూ కుక్కలు అరిచే
బండెక్కి, ఎంచక్కా ఇళ్లకు చేరాం!

– బి. పాండురంగ,
83412 12132.



బొమ్మరిల్లు






బొమ్మరిల్లు
ఇ.పూజ శ్రీత,
కూనపురాజపర్వ,
రెడ్డిగూడెం, ఎన్‌టిఆర్ జిల్లా.



పి.ప్రవల్లిక, 9వ తరగతి,
యం.తిమ్మాపురం ఆదర్శ పాఠశాల,
మహానంది,నంద్యాల జిల్లా.







ఎస్ క్రిషాయ్ అశుతోష్,
2వ తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి,
గుంటూరుజిల్లా.



అనుభవం నేర్పిన పాఠాలకు విలువ ఎక్కువ. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఇష్టంతో చేసే పనులకు విజయాలు ఎక్కువ.

చిన్న ప్రయత్నం.. పెద్ద ఫలితం...

చిన్న చిన్న పనుల నుండే పెద్ద పెద్ద ఫలితాలు వస్తాయని చాలా తక్కువ మంది భావిస్తారు. అలాంటి వారిలో ఒకరు అకుల్ బిశ్వాస్. పశ్చిమ బెంగాల్‌లోని సుందరబాన్ ద్వీపం తరచూ ప్రకృతి ప్రకోపాలకు తీర ప్రాంతాలకు అతలాకుతలమైపోతుంటుంది. వరదలను తట్టుకునే, నది కోతను నియంత్రించే శక్తివంతమైన నేల అక్కడ కనపించదు. దీంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతారు. సాగు చేసే భూమి ఉన్నా, వరదల భయంతో చాలామంది ఇతర రాష్ట్రాలకు వలసపోతుంటారు. ఈ పరిస్థితిలోనే మార్పు తేవాలని అకుల్ సంకల్పించాడు. అనుకున్నదే తడవుగా తీరం వెంబడి మడ అడవిని సృష్టించాడు. రెండు దశాబ్దాల క్రితం శ్రీకారం చుట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో మొదట అతడికి తోడుగా వచ్చింది చాలా తక్కువ మందే. కానీ ఇప్పుడు 2 వందల మందికి పైగా మహిళలు భాగస్వామ్యమయ్యారు. 'ఝుర్ఖాలి సాబూజ్ బహిని' (జెఎస్‌బి) పేరుతో ఈ మిషన్‌ను ముందుకు నడిపిస్తున్న అకుల్ ముందుచూపుకు ఇప్పుడక్కడ ప్రతి ఒక్కరూ శభాష్ అంటున్నారు. చూపు లేకపోయినా ఎంతో దూరదృష్టితో ప్రకృతి ప్రకోపానికి అడ్డుకట్ట వేసిన అకుల్ ఆ ప్రాంతంలో సాగించిన విశేష కృషి గురించి తెలుసుకుందాం.

ప్రతి ఏడాది వర్షాకాలం ప్రారంభం కాగానే పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణా జిల్లా సుందర్‌బాన్ ప్రాంతంలోని ఝుర్ఖాలీ గ్రామ మహిళలు మడ చెట్ల విత్తనాలను సేకరించేందుకు ప్రయాణమవుతారు. వాటిని నర్సరీకి చేర్చడం, మట్టి సంచుల్లో నింపడం వారి దినచర్య. మూడు నెలల తరువాత ఆ విత్తనాలు మోకాలు ఎత్తు వరకు పెరుగుతాయి. ఇక అప్పటి నుండి జెఎస్‌బి వాలంటీర్లు ప్రతి మొక్కను తీర ప్రాంతం వెంబడి ఉన్న తమ ఇంటి చుట్టుపక్కల నాటుకుంటూ వెళతారు.

అక్టోబరు నుంచి జనవరి మధ్య కాలంలో రోజుకు రెండు గంటలపాటు ఆ మొక్కలు నాటుతారు. 'అలా ఒక్కో మహిళ, 200 నుండి 250 మొక్కలు నాటుతాం' అని చెబుతోంది 45 ఏళ్ల కల్పనా సర్దార్. కల్పన పర్యావరణ కార్యకర్తగా 2021 నుండి జెఎస్‌బిలో భాగమైంది. అప్పటి నుండి వేల కొలది మొక్కలను స్వయంగా నాటింది.

జెఎస్‌బిలో భాగమైన 200 మంది వాలంటీర్లకి ఇదే దినచర్య. ఇప్పుడు ఈ వాలంటీర్లు సుందర్‌బాన్ వ్యాప్తంగా 23 జిల్లాల్లో తమ సేవలను విస్తరించారు. 'వరదలు, ప్రకృతి ప్రకోపాల నుంచి మమ్మల్ని మేం రక్షించుకోవాలంటే ఇది తప్పితే మాకు వేరే మార్గం లేదు. మొదట అకుల్ ఒక్కరే ఈ



కార్యక్రమాన్ని ప్రారంభించినప్పుడు మేమెవరమూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ దాని ఫలితం గురించి అకుల్ మాకు బాగా వివరించారు. అప్పటి నుండి ఈ పని నుండి వెనుకడుగు వేయలేదు' అని తన అనుభవాన్ని కల్పన చెబుతోంది.

'ద్వీప ప్రాంతమైన సుందర్‌బాన్‌లో తక్కువ వృక్ష సంపద ఉన్న చోట వరదలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. తుఫాను గాలుల తీవ్రత కూడా ఇక్కడ ఎక్కువే. ఇది గమనించిన నేను ఈ ప్రాంత వాసుల్లో మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలనుకున్నాను. మొదట్లో ఎవరూ



రాకపోయినా దశాబ్దం తరువాత నుండి ఈ ప్రాంతం నుండి వందల స ంఖ్యల్లో పర్యావరణ ప్రేమికులు ముందుకువచ్చారు' అని అకుల్ తన ప్రయాణం గురించి వివరించారు.

సుందర్బాన్ ప్రాంత ప్రకృతి దృశ్యం చాలా ప్రత్యేకమైనది. ఇక్కడ అనేక నీటి వనరులు ఉంటాయి. చుట్టూ సముద్ర నీటితో నిండి ఉండే అందమైన ఈ ద్వీపంలో ఏడాది పొడుగునా, సముద్ర ఆటు, పోట్లు, తుఫానులు, భారీ వర్షపాతం వల్ల తరచూ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయి. పైగా ఇటీవలి కాలంలో వాతావరణంలో వచ్చిన విపరీత మార్పుల వల్ల ఈ ప్రకృతి వైపరీత్యాల తీవ్రత బాగా పెరిగింది. అనేక ద్వీపాలు ఇప్పటికే నీటి అడుగున మునిగిపోయాయి. ఈ ముప్పు నుండి సుందరబాన్‌ని రక్షించేందుకు అకుల్ చేసిన ఈ చిన్న ప్రయత్నం, ఇప్పుడు పెద్ద ఫలితాలను తెచ్చిపెడుతోంది.

2021లో సుందర్‌బాన్‌ని అతలాకుతలం చేసిన యాస్ తుపాన్ ఝుర్ఖలీ తీర ప్రాంత వాసులని మాత్రం నిరాశ్రయులని చేయలేదు. ఈ ప్రాంతంలో నది కోతకు గురవ్వకుండా జెఎస్‌బి వాలంటీర్లు సంరక్షించిన వృక్ష సంపద వారిని కాపాడింది. ఇప్పుడీ మహిళలు తమ ప్రాంతంలోనే వ్యవసాయం చేసేందుకు కూడా ముందుకు వస్తున్నారు. ఈ ప్రయోజనాలను దగ్గర నుండీ పరిశీలిస్తున్న ఇతర గ్రామస్తులు కూడా తమ ప్రాంతంలో వృక్ష సంపద పెంచేందుకు ముందుకు వస్తున్నారు. 'నేను చేసిన ఓ చిన్న ప్రయత్నం, పెద్ద ప్రయోజనాన్ని కలిగించినందుకు చాలా సంతోషంగా ఉంద'ని అకుల్ చెబుతున్నప్పుడు తమ కోసం, తమ ప్రయోజనాల కోసం కాకుండా ఇతరుల కోసం పనిచేసే ఔత్సాహికులు స్ఫురణకు వస్తారు.

సెకండ్ ఇన్నింగ్స్‌లో సరికొత్తగా ...



సినిమాల్లో నటించే కథానాయికలు కొన్నేళ్లపాటు స్టార్‌డమ్‌గా ఎదిగిపోతారు. పెళ్లయిన తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టులుగా వీరు మారిపోవాల్సి వస్తోంది. గతంలో సావిత్రి, జమున, జయసుధ మాదిరిగా పెళ్లయిన తర్వాత కూడా హీరోయిన్లుగా కొనసాగే అవకాశాలు ప్రస్తుతం తక్కువ. ఈ అంశంపై తాజాగా టాలీవుడ్ అగ్రనటి కాజల్ అగర్వాల్ చేసిన వ్యాఖ్యలు పరిశ్రమలో చర్చనీయాంశం అయ్యాయి. బాలీవుడ్‌లో పెళ్లయిన వారు కూడా హీరోయిన్లుగా నటిస్తుంటే దక్షిణాదిలో ఆ పరిస్థితి లేదని ఆమె అన్నారు. 'బాలీవుడ్, సౌత్ ఇండస్ట్రీ మధ్య చాలా తేడా ఉంది. సమంత లాంటి కొంతమందిని తప్ప దక్షిణాదిలో పెళ్లయిన హీరోయిన్లని పక్కన పెట్టేస్తారు. హిందీలో మాత్రం పెళ్లయినా సరే హీరోయిన్లుగా నటిస్తుంటారు. షర్మిళా ఠాకుర్, హేమమాలిని మొదలుకొని దీపికా పదుకొణె, ఆలియా భట్ లాంటి వాళ్లకు హీరోయిన్లుగా అవకాశాలు వస్తున్నాయి. దక్షిణాదిలో నయనతార, సమంత లాంటి వారు తప్ప మిగిలిన వారికి అవకాశాలు రావడం లేదు. దక్షిణాదిలో నెలకొన్న ఈ పరిస్థితిని త్వరలో మారుద్దాం' అని కాజల్ చేసిన కామెంట్లు అర్థవంతమైనవే! గతంలో ఇలియానా, తాప్సీ, పూజా హెగ్డే వంటి హీరోయిన్లు కూడా ఈ తరహా కామెంట్లు చేశారు. పెళ్లి అయిన తర్వాత హీరోయిన్లు క్యారెక్టర్ ఆర్టిస్టులుగానే మిగలాలా? సినీ పరిశ్రమలో హీరోయిన్స్‌కి కెరీర్ తక్కువ కాలమే ఉంటుందా? వాళ్ళు సినీ పరిశ్రమలో ఉన్నా కొంతకాలం తర్వాత హీరోయిన్స్‌గా తప్పుకొని అక్కా, వదిన, తల్లి, అత్త వంటి పాత్రల్లో నటించాల్సి వస్తోంది. లేదంటే కొంతమంది హీరోయిన్‌గా కెరీర్ అయిపోగానే పక్కకు తప్పుకుంటున్నారు.



గతంలో మన తెలుగులో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్స్ రమ్యకృష్ణ, అమల, రాశి, మీనా, ఇంద్రజ, మీరా జాస్మిన్, సదా, భూమిక, స్నేహ, జెనీలియా, లయ కొంచెం గ్యాప్ తీసుకొని మళ్ళీ సెకండ్ ఇన్నింగ్స్‌కి వచ్చారు. గుడుంబా శంకర్, భద్ర లాంటి సినిమాలతో మెప్పించిన మీరా జాస్మిన్ పెళ్లి చేసుకొని సినిమాలకి గ్యాప్ ఇచ్చింది. కొన్నేళ్ల తర్వాత మళ్లీ సినిమాల్లో నటిస్తోంది. దక్షిణాది చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. జయం, దొంగ దొంగది, అపరిచితుడు, ఔనన్నా కాదన్నా లాంటి పలు సినిమాలతో తెలుగులో



మెప్పించిన 'సదా' ప్రస్తుతం సినిమాలకి దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే టీవీ షోలలో జడ్జిగా, గెస్ట్‌గా రావడం మొదలు పెట్టి సినిమాల్లో కూడా సెకండ్ ఇన్నింగ్స్‌కి రెడీగా ఉన్నట్లుగా ప్రకటించారు. మంచి పాత్ర పడితే ఖచ్చితంగా మళ్ళీ సినిమాల్లోకి వస్తా అని అంటున్నారు. ఖుషి, ఒక్కడు, సింహాద్రి లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో తెలుగువారిని మెప్పించిన భూమిక మధ్యలో గ్యాప్ తీసుకొని ఆల్రెడీ సెకండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టింది. ఇప్పటికే పలు సినిమాల్లో అక్క, వదిన క్యారెక్టర్స్‌తో మెప్పిస్తున్నారు. ప్రియమైన నీకు, వెంకీ, శ్రీరామదాసు, సంక్రాంతి లాంటి సినిమాలతో తెలుగులో అలరించిన స్నేహ ఇప్పటికే అక్క, వదిన క్యారెక్టర్స్‌లో దూసుకుపోతున్నారు. సత్యం, సై, రెడీ, ఢీ, బొమ్మరిల్లు, ఆరెంజ్ లాంటి సూపర్ హిట్ సినిమాలతో తెలుగు వారికి బాగా దగ్గరైన హీరోయిన్ జెనీలియా. బాలీవుడ్ హీరో రితేష్‌ని పెళ్లి చేసుకొని సినిమాలకి దూరమైంది. మధ్య మధ్యలో కొన్ని సినిమాల్లో గెస్ట్ అప్పీరెన్స్ ఇచ్చినా ఓ మరాఠీ సినిమాతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ని ప్రారంభించారు. తెలుగులో కూడా మంచి పాత్రలు వస్తే చేయటానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. బాలకష్ణ సినిమా నారీ నారీ నడుమ మురారి సినిమాలో హీరోయిన్‌గా నటించిన నిరోషా ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్టుగా కూడా కొన్ని సినిమాల్లో నటించారు. ఒకటి రెండు సినిమాల తర్వాత ఆమె తెర మీద కనిపించకుండా పోయారు. ఐశ్వర్య, గౌతమి పరిస్థితి కూడా కొంత మెరుగ్గానే ఉంది. దేవదాసు, ఓ బేబీలో మెప్పించారు. అన్నీ మంచి శకునములే వంటి చిన్న సినిమాల్లో ఆమె కనిపించారు. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడే లయ అమెరికా డాక్టర్‌ని పెళ్లి చేసుకొని సెటిలయ్యారు. మళ్లీ సినిమాల్లో నటించేందుకు సిద్ధమంటున్నారు. శబ్దం అనే సినిమాలో లీడ్ రోల్ చేశారు. అనేక టీవీ షోల్లో పాల్గొంటున్నారు. మంచి ట్యాలెంటెడ్ ఆర్టిస్ట్‌గా పేరు సంపాదించుకున్న ప్రియమణి హీరోయిన్‌గా కెరీర్‌లో స్టార్‌గా ఎదగలేకపోయింది. తెలుగు, తమిళ సినిమాల్లో ఇప్పుడిప్పుడే ఆమెకు మళ్లీ అవకాశాలు వస్తున్నాయి. అందుకే పలు టీవీ షో లతో హల్చల్ చేస్తున్నారు. స్నేహ సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసి ఇప్పటికే పలు సినిమాలు చేసినా ఎందుకో ఆమెకు మళ్లీ అవకాశాలు రావడం లేదు.

ఎదురులేని ఆసీస్

- ఇంగ్లాండ్‌పై 36 పరుగులతో గెలుపు
- ఆస్ట్రేలియా 201/7, ఇంగ్లాండ్ 165/6



బ్రిడ్జ్‌టౌన్ : డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లాండ్ చతికిల పడింది. 202 పరుగుల ఛేదనలో మిడిల్ ఆర్డర్ వైఫల్యంతో పరాజయం మూటగట్టుకుంది. స్కాట్లాండ్‌తో మ్యాచ్ వర్షార్పణం, ఆసీస్ చేతిలో ఓటమితో డిఫెండింగ్ చాంపియన్ గ్రూప్ దశ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో పడింది. ఫిల్ సాల్ట్ (37, 23 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోశ్ బట్లర్ (42, 28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఛేదనలో అదిరే ఆరంభం అందించారు. తొలి వికెట్‌కు 7.1 ఓవర్లలోనే 73 పరుగులు జోడించారు. కానీ ఓపెనర్లు ఇద్దరూ జంపా మాయలో పడటంతో ఇంగ్లాండ్‌కు కష్టాలు మొదలయ్యాయి. విల్ జాక్స్ (10), జానీ బెయిర్‌స్టో (7) విఫలమయ్యారు. మోయిన్ అలీ (25), హ్యారీ బ్రూక్ (20 నాటౌట్), లివింగ్‌స్టోన్ (15) అంచనాలను అందుకోలేదు. 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసిన ఇంగ్లాండ్ 36 పరుగుల తేడాతో భారీ ఓటమి చవిచూసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. ట్రావిశ్ హెడ్ (34, 18 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), డెవిడ్ వార్నర్ (39, 16 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (35, 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), మార్కస్ స్టోయినిస్ (30, 17 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహా గ్లెన్ మాక్స్‌వెల్ (28, 25 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఆసీస్ స్పిన్నర్ జంపా (2/28) 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండు మ్యాచుల్లో రెండు విజయాలతో గ్రూప్-బిలో ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతుంది.

ఉగాండా ఢమాల్

- **39 పరుగులకే ఆలౌట్**
- **కరీబియన్ల ఏకపక్ష విజయం**



ప్రావిడెన్స్ : తొలిసారి ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడుతున్న పసికూన ఉగాండాపై వెస్టిండీస్ పంజా విసిరింది. కరీబియన్ పేసర్ అకీల్ హొస్సేన్ (5/11) ఐదు వికెట్ల విజృంభణతో ఉగాండా ఉలిక్కిపడింది. 12 ఓవర్లలో 39 పరుగులకే కుప్పకూలింది. అల్జారీ జొసెఫ్ (2/6) సైతం మెరవటంతో ఉగాండా టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే అత్యల్ప స్కోరుకు ఆలౌటైంది. 174 పరుగుల భారీ ఛేదనలో ఉగాండా బ్యాటర్లు విలవిల్లాడారు. కరీబియన్ భీకర పేస్ ముందు తేలిపోయారు. టెయిలెండర్ జుమా (13 నాటౌట్) ఒక్కడే ఉగాండా ఇన్నింగ్స్‌లో రెండెంకల స్కోరు సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 173 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (44, 42 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఆండ్రీ రసెల్ (30 నాటౌట్, 17 బంతుల్లో 6 ఫోర్లు) సహా నికోలస్ పూరన్ (22), రోవ్‌మాన్ పావెల్ (23), రూథర్‌ఫోర్డ్ (22) రాణించారు. గ్రూప్-సిలో రెండు విజయాలు సాధించిన వెస్టిండీస్.. అఫ్గనిస్థాన్‌తో సమానంగా 4 పాయింట్లు గెల్చుకుంది. మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో అఫ్గాన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉండగా, విండీస్ రెండో స్థానంలో కొనసాగుతుంది. ఇదే గ్రూప్‌లో న్యూజిలాండ్ అట్టడుగు స్థానంలో ఉంది.

యుఎఫ్‌సిలో బీజూజా తోమర్ గెలుపు

- తొలి ఇండియన్‌గా రికార్డు

కెంటుకీ : అమెరికాలో జరిగే అల్టిమేట్ ఫైటింగ్ ఛాంపియన్‌షిప్ (యుఎఫ్‌సి)లో భారత్‌కు చెందిన పూజా తోమర్ ఒక బౌట్‌లో విజయం సాధించింది. దీంతో యుఎఫ్‌సిలో విజయం సాధించిన తొలి భారత వ్యక్తిగా రికార్డు సృష్టించింది. స్ట్రా-వెయిట్ (52 కేజీలు) విభాగంలో బ్రెజిల్‌కు చెందిన రేయాన్ డాస్ శాంటోస్‌పై 30-27, 27-30, 29-28 పాయింట్లతో తోమార్ విజయం సాధించింది. విజయం అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ విజయం తన విజయం మాత్రమే కాదని, భారత అభిమానులందరిదీ, భారత యోధులందరదీ అని అన్నారు. 'భారత ఫైటర్లు ఇక్కడ రాణించలేని అనుకునే వారందరికీ నేను ఇక్కడ గెలిచి భారత ఫైటర్లు ఓడిపోయేవారు కాదని ప్రపంచానికి చూపిం చాలని మాత్రమే నేను అనుకున్నాను' అని అన్నారు. 30 ఏళ్ల పూజా తోమర్ గత ఏడాది అక్టోబర్‌లో యుఎఫ్‌సితో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో అతి పెద్ద మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ప్రమోషన్‌లో పోటీ పడిన తొలి భారత మహిళగా నిలిచారు. ఉత్తం ప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలోని బుధనా గ్రామంలో పూజా జన్మించారు. ఐదు సార్లు జాతీయ వుషు ఛాంపియన్‌గా నిలిచారు.

మహిళల హాకీలో భారత్ ఓటమి

లండన్ (ఇంగ్లాండ్) : ఎఫ్‌ఐహెచ్ మహిళల హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు మరోసారి ఓటమి పాలైంది. గ్రేట్ బ్రిటన్‌తో మ్యాచ్‌లో 2-3తో ఓడిపోయారు. లాల్‌రెమిసియామి, నవనీత్ కౌర్‌లు 14, 23వ నిమిషాల్లో గోల్స్‌తో భారత్‌ను 2-1తో ముందంజలో నిలిపారు. గ్రేస్ బాల్డ్‌సన్ 56, 58వ నిమనిషాల్లో గోల్స్‌తో గ్రేట్ బ్రిటన్‌కు 3-2తో విజయాన్ని అందించింది. ప్రో లీగ్‌లో ఎనిమిదో పరాజయంతో భారత అమ్మాయిలు ఇంటిబాట పట్టారు.




కొత్త మంత్రులతో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని గ్రూప్ ఫొటో

మంత్రివర్గ పొందిక ఇలా..

- 30 మందికి కేబినెట్ హోదా
- స్వతంత్ర హోదాలో ఐదుగురు
- సహాయ మంత్రులుగా 36 మంది

న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహా 72 మందితో కేంద్రంలో కొత్త మంత్రివర్గం కొలువుదీరింది. వీరిలో 30 మంది క్యాబినెట్, ఐదుగురు స్వతంత్ర, 36 సహాయ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీరితో ప్రమాణం చేయించారు. మోడీతో పాటు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్ కూడా క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. బిజెపి అధ్యక్షులు జెపి నడ్డా ఐదేళ్ల తర్వాత తిరిగి మంత్రివర్గంలోకి వచ్చారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మోడీ కేబినెట్‌లో తొలిసారి అడుగపెట్టారు. అలాగే బిజెపి సీనియర్ నేతలు పీయూష్ గోయల్, జ్యోతిరాదిత్య సింధియా, ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్ వంటి నేతలు కేబినెట్‌లో తిరిగి చోటు దక్కించుకున్నారు. మొన్నటివరకు రాజ్యసభ సభ్యులుగా ఉన్న వీరు.. తాజా లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన సంగతి తెలిసిందే. అస్సాం మాజీ సిఎం సర్బానంద సోనోవాల్, అశ్వినీ వైష్ణవ్, వీరేంద్ర కుమార్, ప్రహ్లాద్ జోషి, గిరిరాజ్ సింగ్, జుయల్ ఓరం వంటి బిజెపి నేతలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

మిత్రపక్షాల్లో ఐదుగురికే చోటు

సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ మెజారిటి సాధించలేక చతికిలపడ్డ బిజెపిని ఈ దఫా ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షాలే గట్టెక్కించాయి. అయినా మిత్ర పక్షాల్లో కేవలం ఐదుగురికి కేబినెట్‌లో బెర్తులు లభించాయి. జెడిఎస్ నేత హెచ్‌డి కుమారస్వామి, హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) టిడిపి నుంచి కె.రామ్మోహన్ నాయుడు, ఎల్‌జెపి-ఆర్‌వి నేత చిరాగ్ పాశ్వన్ మంత్రులుగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. ఐదు మిత్రపక్షాలకు ఒక్కో కేబినెట్ మంత్రి చొప్పున కేటాయించారు. వీరిలో కుమారస్వామి, జితిన్ రాం మాంఝీ మాజీ ముఖ్యమంత్రులు.

కేబినెట్ మంత్రులు వీరే..

నరేంద్రమోడీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, జెపి నడ్డా, శివరాజ్ సింగ్ చౌహాన్, నిర్మలా సీతారామన్, ఎస్ జై శంకర్, మనోహర్ లాల్ ఖట్టర్, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, సర్బానంద సోనోవాల్, వీరేంద్ర కుమార్, ప్రహ్లాద్ జోషి, జుయల్ ఓరం, గిరిరాజ్ సింగ్, అశ్వనీ వైష్ణవ్, జ్యోతిరాదిత్య సింధియా, భూపేంద్ర యాదవ్, గజేంద్రసింగ్ షెకావత్, అన్నపూర్ణాదేవి, కిరణ్ రిజిజు, హర్దీప్ సింగ్, మన్‌సుఖ్ మాండవీయ, కిషన్ రెడ్డి, ఇంద్రజీత్ సింగ్, జితేంద్ర సింగ్, అర్జున్ రామ్ మేఘవాల్, ప్రతాప్ రావ్ గణపత్ రావు కుమారస్వామి, జితన్ రాం మాంఝీ, జెడియు నేత లలన్ సింగ్, ఎల్‌జెపి నేత చిరాగ్ పాసవాన్

సహాయ మంత్రులుగా ఎవ్వరంటే..

జయంత్ చౌదరి, జితిన్ ప్రసాద్, శ్రీపాద్ యశో నాయక్, పంకజ్ చౌదరి, క్రిషన్ పాల్, రాందాస్ అఠవలే, రామ్‌నాథ్ ఠాకూర్, నిత్యానంద్ రాయ్, అప్నాదళ్ అధ్యక్షురాలు అనుప్రియా పటేల్, సోమన్న, పెమ్మసాని చంద్రశేఖర్, ఎస్పీ సింగ్ బఘేల్, శోభా కరంద్లాజే, కీర్తి వర్ధన్ సింగ్, బిఎల్ వర్మ, శాంతను ఠాకూర్, సురేశ్ గోపి, ఎల్ మురుగన్, అజయ్ తంప్టా, బండి సంజయ్, కమలేశ్ పాసవాన్, భగీరథ్ చౌదరి, సతీశ్ చంద్ర దూబె, సంజయ్ సేథ్, రవ్‌నీత్ సింగ్, దుర్గాదాస్ ఉయికె, రక్షా నిఖిల్ ఖడ్సే, సుఖాంత్ మజుందార్, సావిత్రి ఠాకూర్, తోకన్ సాహు, రాజ్ భూషణ్ చౌధరి, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, హర్ష మల్హోత్రా, నిముబెన్ బంభానియా, మురళీధర్ మొహోల్, జార్జ్ కురియన్, పబిత్ర మార్గెరెటా.

ఖర్గే మినహా ప్రతిపక్షాల నేతలు దూరం..

మోడీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. ఆయన మినహా మిగిలిన ప్రతిపక్షాల నేతల్లో చాలా వరకు హాజరుకాలేదు. అయితే ఈ కార్యక్రమానికి వ్యాపార, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూపు సంస్థల అధిపతి గౌతమ్ అదానీ, సినీ నటులు షారుక్ ఖాన్, రజనీకాంత్, అక్షయ్ కుమార్, రవీనా టండన్, అనుపమ్ ఖేర్, విక్రాంత్ మస్సే తదిరులు విచ్చేశారు. వీరితోపాటు అంబానీ కుమారులు అనంత్, ఆకాశ్, అల్లుడు ఆనంద్ పిరమల్ రాగా, అలాగే గౌతమ్ అదానీ భార్య ప్రీతి, సోదరుడు రాజేశ్ అదానీ హాజరయ్యారు.



పొరుగు దేశాధినేతల రాక

ఈ ప్రమాణస్వీకారోత్సవానికి పొరుగు దేశాధినేతలు పలువురు తరలివచ్చారు. బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనా, మాల్దీవుల అధ్యక్షులు మొహ్మద్ ముయిజ్జు, శ్రీలంక అధ్యక్షులు రణిల్ విక్రమసింఘే, నేపాల్ ప్రధానమంత్రి ప్రచండ, మారిషస్ ప్రధానమంత్రి ప్రవింద్ కుమార్ జుగ్‌నౌద్, భూటాన్ ప్రధానమంత్రి షెరింగ్ తోబ్గే, సీషెల్స్ ఉపాధ్యక్షులు అహ్మద్ ఆఫిఫ్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మొత్తంగా దాదాపు 8 వేల మందికి పైగా అతిథులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కర్ణాటక శాసనమండలి ఎన్నికల్లో బిజెపికి ఎదురు దెబ్బ

బెంగుళూరు : కర్ణాటక శాసనమండలి ఎన్నికల్లో బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో పోటీ చేసిన బిజెపి కేవలం ఒక స్థానానికి పరిమితమైంది. ఇటీవల మండలిలోని మొత్తం ఆరు ఖాళీలకు ఎన్నికలు నిర్వహించారు. మూడు పట్టభద్రుల నియోజకవర్గాలకు, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం ఆరు స్థానాల్లో మూడు స్థానాలను అధికార కాంగ్రెస్ గెలుచుకుంది. జెడి(ఎస్)కు రెండు స్థానాలు, బిజెపికి ఒక స్థానం దక్కింది. అయితే 75 మంది సభ్యులుండే కౌన్సిల్‌లో ఎన్‌డిఎ మెజార్టీ కొనసాగుతోంది. తాజా ఎన్నికల తరువాత ఎన్‌డిఎ బలం 38గా (బిజెపి 30, జెడిఎస్ 8) ఉండగా కాంగ్రెస్ సంఖ్యా బలం 34కు పెరిగింది. లోక్‌సభ ఎన్నికల తరువాత జగదీష్ షెట్టర్ రాజీనామా చేయడంతో కౌన్సిల్ ఇంకొంక స్థానం భర్తీ చేయాల్సివుంది. ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తే తమ పార్టీ అభ్యర్థిగా బసనగౌడ బాదర్లీ పోటీ చేస్తారని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది.

ఏకకాలంలో ఒకే రన్‌వేపై రెండు విమానాలు

- ఎటిసిఓపై వేటు

ముంబయి : ముంబయిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం తెల్లవారుజామున పెను ప్రమాదం తప్పింది. ఏకకాలంలో ఒకే రన్‌వే మీద రెండు విమానాల రాకపోకలకు అనుమతులివ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రన్‌వేపై ఎయిర్ ఇండియా 657 విమానం ఇంకా టేకాఫ్ ప్రక్రియలో ఉండగానే ఇండిగో 5053 అదే రన్‌వే దిగింది.

రెండింటికి మధ్య కొన్ని వందల మీటర్ల దూరమే ఉంది. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. రెండు విమానాలు ఒకే రన్‌వేపై ప్రయాణించడం.. ఇండోర్ నుంచి వచ్చిన ఇండిగో విమానం ల్యాండ్ అవుతుండగా.. అదే సమయంలో ఎయిర్ ఇండియా విమానం తిరువనంతపురం వెళ్లేందుకు గాల్లోకి ఎగిరడం వీడియోల్లో స్పష్టంగా ఉంది. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విమానాశ్రయానికి చెందిన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్ (ఎటిసిఓ)ను విధులను నుంచి తప్పించింది. ఈ ఘటనపై ఇండిగో స్పందించింది. తమ పైలట్ ముంబయి ఎయిర్ పోర్టు ఎటిసి సూచనల ప్రకారమే నడుచుకున్నారని తెలిపింది. దీనిపై ప్రొసిజర్ ప్రకారం రిపోర్టు చేశామని తెలిపింది.

బంగ్లాదేశ్ ఎంపి హత్య కేసు.. కీలక నిందితుడి అరెస్టు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపి అన్వరుల్ అజీమ్ అనర్ కేసులో కీలక నిందితుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. నేపాల్‌లో అక్కడి పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేయగా, భారత్‌కు తీసుకువచ్చారు.

నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గాలింపు చేపట్టగా.. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఒక కాలువలో ఎంపికి చెందిన కొన్ని శరీర భాగాలను గుర్తించారు. ఈ వివరాలను పశ్చిమ బెంగాల్ పోలీసులు ఆదివారం వెల్లడించారు. "వైద్యులు, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో గాలింపు జరపగా.. ఒక కాలువలో మనిషి శరీర భాగాలు, ఎముకలు లభ్యమయ్యాయి. వీటిని ఎంపికి చెందినిగానే అనుమానిస్తున్నాం. వాటిని ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపిస్తాం. ఇతర శరీర భాగాల కోసం గాలింపు కొనసాగుతుంది" అని పోలీసులు వెల్లడించారు. అంతకుముందు ఎంపి శరీరానికి సంబంధించినగా భావిస్తోన్న దాదాపు మూడున్నర కిలోల మాంసపు ముద్దను హత్య జరిగిన అపార్టుమెంటు సెప్టిక్ ట్యాంకులోనే గుర్తించిన సంగతి తెలిసిందే. అయితే ఈ శరీర భాగాల నిర్దిష్టత గుర్తింపు కోసం డిఎన్ఎ పరీక్ష నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం డిఎన్ఎ నమూనాలు సేకరించేందుకు ఆయన కుమార్తెను కొల్‌కతాకు రప్పించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

జమ్ముకాశ్మీర్‌లో బస్సుపై 'ఉగ్ర' కాల్పులు

- అదుపు తప్పి లోయలో పడిన బస్సు
- తొమ్మిది మంది మృతి

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. ఆదివారం సాయంత్రం రైసీ జిల్లాలో యాత్రీకులతో ప్రయాణం చేస్తున్న బస్సుపై కాల్పులకు తెగబడ్డారు. దీంతో బస్సు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించాగా, 33 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు యాత్రీకులతో శివ్ ఖోరి కేవ్ మందిరానికి వెళ్తుండగా ఈ దాడికి గురైంది. ఉగ్రవాదులు కాల్పులు జరపడంతో బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడని, దీంతో బస్సు లోయలోకి పడిపోయిందని రైసీ సీనియర్ ఎస్‌పి మోహితా శర్మ తెలిపారు. ప్రమాదం



జరిగిన వెంటనే స్థానికులు రంగంలోకి దిగి యాత్రీకులను రక్షించడానికి ప్రయత్నించారు. తరువాత పోలీసులు, ఆర్మీ, పారామిలటరీ దళాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సరిహద్దు జిల్లాలు రాజౌరీ, పూంచ్ జిల్లాతో పోలిస్తే రైసీ జిల్లాలో ఉగ్రవాద కార్యక్రమాలు తక్కువగా ఉంటాయి. ఇలాంటి జిల్లాలో ఉగ్రదాడి జరగడం ఆందోళన కలిగిస్తోందని అధికారులు తెలిపారు. మృతుల్ని ఇంకా గుర్తించలేదని, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించి, చికిత్స ఆందిస్తున్నామని రైసీ జిల్లా విశేష్ మహజన్ తెలిపారు.


నవీన్ పట్నాయక్‌తో పాండియన్ (ఫైల్ ఫొటో)

రాజకీయాలకు పాండియన్ గుడ్‌బై

భువనేశ్వర్: ఒడిషా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ సన్నిహితులు, మాజీ ఐఎఎస్ అధికారి వికె పాండియన్ రాజకీయాలకు గుబ్‌బై చెప్పారు. ఇటీవల జరిగిన ఒడిషా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బిజూ జనతాదళ్ (బిజెడి) ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో పాండియన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. ఆదివారం ఈ మేరకు వీడియో విడుదల చేశారు. తాను నవీన్ పట్నాయక్‌కు సహాయంగా ఉండాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పుడు రాజకీయాల నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. తన రాజకీయ ప్రయాణంలో ఎవర్నైనా నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. అలాగే, తనపై జరిగిన దుష్ప్రచారం వల్ల పార్టీ ఓటమి పాలై ఉంటే అందుకు క్షమించాలన్నారు. నవీన్ మరోసారి విజయం సాధించని పక్షంలో తాను రాజకీయ సన్యాసం స్వీకరిస్తానని గతంలో చెప్పిన పాండియన్ అందుకు తగ్గట్టే తన నిర్ణయాన్ని వెలువరించారు. తమిళనాడుకు చెందిన పాండియన్ ఒడిషా కేడర్ ఐఎఎస్ అధికారిగా ఈ రాష్ట్రంలో విధుల్లో చేరారు. అనంతరం నాటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు సన్నిహితునిగా మారారు. ఎన్నికల ముందు ఉద్యోగానికి రాజీనామా చేసి బిజెడిలో చేరారు. నవీన్ పట్నాయక్ నిర్ణయాలను పాండియన్ ప్రభావితం చేస్తున్నారని, ఆయన ఎలా చెబితే అలా నవీన్ నడుస్తున్నారంటూ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఆరోపణలు గుప్పించింది.

సేవ చేయటానికా.. సంపద పెంచుకోవటానికా..?

- గుజరాత్ ఎంపీలు వంద శాతానికి మించి పోగేసుకున్నారు ..
- ఎడిఆర్ డేటా



గాంధీనగర్ : గుజరాత్ నుంచి ఎన్నికైన 26 మంది ఎంపీలలో 12 మంది తమ నియోజకవర్గాలకు రెండోసారి లేదా అంతకంటే ఎక్కువసార్లు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించనున్నారు. అయితే, 12 మందిలో ఐదుగురి సంపద 2019తో పోలిస్తే 2024లో 100 శాతం కంటే ఎక్కువ పెరిగింది. గెలిచిన 26 మంది ఎంపీల్లో 23 మంది మిలియనీర్లు కాగా, మరో ఐదుగురు నేర చరిత్ర కలిగి ఉన్నారు. మిలియనీర్ ఎంపీల సంఖ్య 2014లో 21గా ఉండగా.. 2019లో అది 24కి చేరింది. ఐదుగురు గుజరాత్ ఎంపీల సంపద గత ఐదేండ్లలో గణనీయంగా 112 నుంచి 273 శాతం పెరిగిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక వెల్లడించింది. భరూచ్ నుంచి ఏడుసార్లు గెలిచిన బిజెపి ఎంపీ మన్సుఖ్ వాసవా సంపద అత్యధికంగా 273 శాతం పెరిగింది. 2019లో, ఆయన ఆస్తుల విలువ రూ.68.35 లక్షలుగా ఉన్నది. ఇది ఈ ఏడాది రూ.2.54 కోట్లకు పెరిగింది. అంటే, రూ.1.86 కోట్ల పెరుగుదల నమోదైంది. వాసవ తన ఆదాయాన్ని తన లోక్‌సభ జీతం, బ్యాంకు వడ్డీ, ఇతర వనరులకు ఆపాదించాడు.

జామ్‌నగర్ మహిళా ఎంపీ పూనమ్ మేడమ్ 2019 నుంచి రూ.104 కోట్ల ఆస్తులు పెరగటంతో అత్యధిక సంపద సంపాదించిన వారిలో రెండో స్థానంలో ఉన్నారు. ఆమె సంపద 2019లో రూ 42.73 కోట్ల నుండి 2024లో రూ.147.70 కోట్లకు పెరిగింది. చాలా మంది గుజరాత్ బిజెపి ఎంపీల సంపద పెరుగుతుండగా.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, నవ్‌సారి ఎంపీ సిఆర్ పాటిల్ ఆస్తులు క్షీణించటం గమనార్హం. 2019 నుంచి 2024 వరకు ఆయన సంపద 11 శాతం తగ్గింది. 2019లో, పాటిల్ ఆస్తుల విలువ రూ.44.60 కోట్లు. కానీ 2024 నాటికి అవి రూ.39.49 కోట్లకు పడిపోయాయి. అంటే, రూ. 5.11 కోట్ల తగ్గుదల కనిపించింది. గాంధీనగర్ ఎంపీ అమిత్ షా, జునాగఢ్ ఎంపీ రాజేష్ చుడాసమా, రాజ్‌కోట్ ఎంపీ పురుషోత్తం రూపాలా, ఛోటా ఉదయ్‌పూర్ ఎంపీ జసు రథ్వా, బనస్కాంత కాంగ్రెస్ ఎంపీ జెనిబెన్ ఠాకోర్‌లపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. 2024లో గుజరాత్ నుంచి గెలిచిన 26 మంది అభ్యర్థుల్లో ఐదుగురిపై క్రిమినల్ కేసులున్నాయి. ఈ సంఖ్య.. 2019లో నాలుగు, 2014లో తొమ్మిదిగా ఉన్నది. 2024లో గెలుపొందిన అభ్యర్థుల్లో (కాబోయే ఎంపీలు) 46 శాతం మంది నేర చరిత్ర కలిగి ఉన్నారనీ, 31 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్నారని ఎడిఆర్ నివేదిక పేర్కొన్నది. నేర చరిత్ర కలిగిన ఎంపీల శాతం 2019లో 43 శాతం, 2014లో 34 శాతం, 2009లో 30 శాతంగా ఉన్నది.

గాజాలో ఊచకోత ఆపండి

- వైట్ హౌస్ ఎదుట 'భారీ' నిరసన ర్యాలీ

వాషింగ్టన్: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న దారుణ మారణ కాండకు నిరసనగా, నెతన్యాహుకు పెద్ద మద్దతుదారుగా ఉన్న బైడెన్ ప్రభుత్వ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా శనివారం అమెరికా అధ్యక్ష భవనం (వైట్ హౌస్) ఎదుట వేలాది మంది ప్రదర్శన నిర్వహించారు. అమెరికా పీపుల్స్ రెడ్ లైన్ ఇచ్చిన పిలుపుమేరకు వేలాది మంది ఈ ర్యాలీలో పాల్గొన్నారు. యూదు దురహంకార నెతన్యాహు ప్రభుత్వం అన్ని అంతర్జాతీయ చట్టాలను, న్యాయ నియమాలను ఉల్లంఘిస్తూ పాలస్తీనీయులను ఊచకోత కోస్తుంటే బైడెన్ నిర్దేశించిన రెడ్ లైన్‌ను నెతన్యాహు దాట లేదంటూ వైట్ హౌస్ సన్నాయి నొక్కులు నొక్కడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సెంట్రల్ గాజాలో సుసిరాత్‌లో శిబిరంలో సజీవంగా ఉన్న నలుగురు బందీల విడుదల కోసం 250 మందికిపైగా అమాయక పాలస్తీనా పౌరులను ఇజ్రాయిల్ పొట్టనపెట్టుకుంది. ఈ దాడుల్లో మరో 400 మంది దాకా గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాష్టీకం పట్ల అమెరికా, బ్రిటన్, చిలీతో సహా పలు దేశాల్లో నిరసనాగ్రహాలు వ్యక్తమయ్యాయి.

వైట్ హౌస్ ఎదుట జరిగిన ర్యాలీలో నిరసనకారులు పాలస్తీనా జెండా పట్టుకుని గాజాపై దాడులు ఆపండి. పాలస్తీనాకు విముక్తి కల్పించండి , తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయండి అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు.

చిలీ రాజధాని శాంటియాగోలో ఆందోళనకారులు



గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను వ్యతిరేకిస్తూ వైట్ హౌస్ వద్ద ఆందోళన చేస్తున్న అమెరికన్లు

పాలస్తీనాకు నరహంతక ఇజ్రాయిల్ నుండి విముక్తి కల్పించాలని కోరుతూ శనివారం ప్రదర్శన నిర్వహించారు. హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశాలను సైతం ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. చిలీలోని బోరిక్ ప్రభుత్వం పాలస్తీనాకు పూర్తి మద్దతు ప్రకటించింది. శాంటియాగో విశ్వవిద్యాలయం ఇజ్రాయిల్ టెక్నాలజీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాలను తాత్కాలికంగా నిలిపివేసింది.



అమ్రా రామ్‌ను అభినందిస్తున్న ఏచూరి, వేదికపై బృందాకరత్, అశోక్ థావలే, తపన్ సేన్ తదితరులు

లోక్‌సభలో రైతాంగ గళం

- అమ్రారామ్‌కు కిసాన్ సభ అభినందనలు

న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని సికార్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి 'ఇండియా' ఫోరం తరపున సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసి విజయఢంకా మోగించిన వ్యవసాయోద్యమ నాయకులు అమ్రా రామ్‌ను అఖిల భారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) ఘనంగా సత్కరించింది. ఢిల్లీలోని ఎఐకెఎస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఈ సత్కార కార్యాక్రమానికి సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎ విజయరాఘవన్, కార్మిక, రైతు సంఘాల నాయకులు తపన్ సేన్, హన్నన్ మొల్లా, విజ్జు కృష్ణన్ తదితరులు హాజరయ్యారు. ఎఐకెఎస్ మాజీ జాతీయ అధ్యక్షులు కూడా అయిన అమ్రా రామ్‌కు ఏచూరి, బృందా ప్రభృతులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎఐకెఎస్ ప్రధానకార్యదర్శి విజ్జు కృష్ణన్ శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో రైతుల పక్షాన పోరాటం సాగించిన అమ్రా రామ్ ఇక నుంచి లోక్‌సభలోనూ రైతులు పక్షాన, వ్యవసాయ కార్మికుల పక్షాన గళాన్ని వినిపిస్తారని తెలిపారు. కిసాన్‌సభ మాజీ ప్రధానకార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ వ్యవసాయోద్యమానికి ప్రతీకగా నిలిచిన అమ్రారామ్ పార్లమెంటులో అడుగుపెట్టడం ద్వారా అక్కడ కూడా అన్నదాతల గళం ప్రతిధ్వనిస్తుందని చెప్పారు. ఎఐకెస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే మాట్లాడుతూ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించడంలో అమ్రా రామ్ మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సభ నాయకులు పి కృష్ణ, ఐద్వా ప్రధానకార్యదర్శి మరియం దావలే, జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షులు ఐసి ఘోష్; ఢిల్లీ వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాజీవ్ కన్వర్, దళిత్ శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) నాయకులు నత్తు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శతకోటీశ్వర్ల పన్నుపై మీరెటు?

- మద్దతిస్తారా? లేదా పేదలపైనే భారాలేస్తారా?
- కేంద్రానికి జైరాం రమేశ్ ప్రశ్న

న్యూఢిల్లీ : శ్రమజీవుల కష్టార్జితంతో కోట్లకు పడగలెత్తిన శతకోటీశ్వర్లపై పన్నులు (బిలియనీర్ ట్యాక్స్) విధించాలంటూ ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రస్తుతం చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రంలో నూతన ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టేవారికి కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఇదే అంశంపై ప్రశ్నలు సంధించారు. 'బిలియనీర్ పన్నుపై మీరెంటుంటారు?' అని ఆయన నిలదీశారు. శతకోటీశ్వర్లపై పన్ను విధించడానికి మద్దతు ఇస్తారా? లేదా ఎప్పటిలాగే పేదలపై భారాలు మోపడం కొనసాగిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధానమంత్రి మోడీ సామాన్యుడి వైపు ఉంటారా? లేకా బిలియనీర్ల వైపు నిలబడతారా? అని నిలదీశారు. 'సామాన్యుల వైపు ఉంటారా? లేదా బిలియనీర్ల వైపు నిలబడతారా? అనే విషయం నిరూపించేందుకు ఈ ఏడాది ఓ అవకాశం రానుంది. బ్రెజిల్‌లో జరిగే జి20 సమావేశంలో బిలియనీర్లపై పన్ను విధించే ప్రతిపాదనపై చర్చ జరగనుంది. దీనికి బ్రెజిల్, ఫ్రాన్స్, స్పెయిన్, దక్షిణాఫ్రికా, జర్మనీల ఆర్థిక మంత్రులు మద్దతు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో భారత తదుపరి ఆర్థిక మంత్రి దీన్ని సమర్థిస్తారా?' అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. వ్యవస్థలో లోపాలు, షెల్ కంపెనీలు, ఇతర మార్గాలను ఉపయోగించుకొంటూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బిలియనీర్లు శ్రామిక వర్గం కంటే తక్కువ పన్నులు కడుతున్నారని కాంగ్రెస్ నేత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే న్యాయమైన వాటా చెల్లించేందుకు గాను బిలియనీర్లపై గ్లోబల్ మినిమమ్ టాక్స్ చెల్లించే అంశంపై జి20లో చర్చ జరగనుందని ఆయన తెలిపారు.

పత్రికా స్వేచ్ఛ కోసం పోరాడిన యోధుడు డెలోయిర్ కన్నుమూత

- జర్నలిస్ట్సు వితవుట్ బోర్డర్ నివాళి



పారిస్: పత్రికా స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడిన యోధుడు, జర్నలిస్ట్సు వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ డైరక్టర్ జనరల్ క్రిస్టోఫ్ డెలోయిర్ శనివారం మరణించారు. ఆయన వయసు53 సంవత్సరాలు. గత కొంత కాలంగా కేన్సర్‌తో పోరాడుతున్న ఆయన ఉన్నట్టుండి ఒక్కసారి ఆ మహమ్మారి ఉగ్రరూపం దాల్చడంతో తనువు చాలించారు. ఆయనకు భార్య, కుమారుడు, తల్లి దండ్రులు ఉన్నారు. ఆయన మృతి పట్ల పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్ట్సు వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ సంస్థ డైరక్టర్లు, సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 2012 నుంచి పన్నెండేళ్ల పాటు జర్నలిస్ట్సు వితవుట్ బోర్డర్ ఇంటర్నేషనల్ డైరక్టర్ జనరల్‌గా, జర్నలిస్ట్సు వితవుట్ బోర్డర్ సెక్రటరీ జనరల్‌గా పత్రికా స్వేచ్ఛను కాపాడడంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచాడు. ఉక్రెయిన్, టర్కీ, ఆఫ్రికా ఇలా ఏ దేశంలో జర్నలిస్టులు నిర్బంధానికి గురైనా వెంటనే అక్కడకు వెళ్లి ప్రభుత్వంతో చర్చించి వారిని విడిపించే దాకా విశ్రమించేవాడు కాదు. రెండేళ్ల క్రితం మాలిలో ఇస్లామిస్ట్ తీవ్రవాదుల చెర నుంచి జర్నలిస్టును విడుదలగావించడంలో డెలోయిర్ చూపిన చొరవ అమోఘం. జర్నలిజం స్వతంత్రతను, వైవిధ్యాన్ని కాపాడేందుకు అహరహం శ్రమించారు. జర్నలిజాన్ని జీవిత పోరాటంగా మలచుకున్నారు. జర్నలిజానికి పెద్ద ముప్పు రాజకీయ ఒత్తిళ్లేనని ఆయన అనేవారు. గత దశాబ్ద కాలంలో పత్రికా స్వేచ్ఛ సూచిలో భారత్ అథమ స్థానానికి పడిపోవడం పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68